APTEL/25/A4660

ఆంధ్ర జనవాదు

తెలుగు దినపత్రిక

ఆంధ్ర జనవాదు

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ తెలుగు రాష్ట్రాలలో జిల్లాల వారీగా, మండలాల వారిగా విలేఖర్లుగా పని చేయడానికి అనుభవం కలిగిన లేక కొత్తగా ఆసక్తి కలిగిన వారు

సంప్రదించండి

89195 17176

సంపుటి :01 సంచిక : 121 ఎడిటర్ : ఎం. ఎ. నవీన్ కుమార్ పేజీలు : 08, వెల. 1రూ/ శనివారం-09 - మే - 2026

# ఈ-ఫైళ్ల పరిష్కారంలో అచ్చెన్నాయుడు నెంబర్ వన్



పాలనలో సాంకేతికతను జోడిస్తున్న ఏపీ ప్రభుత్వం

ఫైళ్ల క్లియరెన్స్‌లో వేగం పెంచడమే ప్రభుత్వ లక్ష్యం

అచ్చెన్నాయుడి పనితనాన్ని ప్రశంసించిన చంద్రబాబు

అమరావతి :ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరిపాలనలో సాంకేతికతను జోడించి, ఫైళ్ల క్లియరెన్స్‌లో వేగాన్ని పెంచడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యంగా వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఈ–ఫైళ్ల పరిష్కారంలో చూపిన చొరవ ఒక సరికొత్త రికార్డుకు దారితీసింది. గతంలో ఈ–ఫైళ్ల క్లియరెన్స్‌కు సగటున 5 గంటల సమయం పట్టేది. అయితే, మంత్రి అచ్చెన్నాయుడు తన శాఖకు సంబంధించిన ఫైళ్లను అత్యంత వేగంగా పరిశీలించి, మిగతా..2లో

# బీఆర్ఎస్ ప్రభుత్వం లిఫ్ట్ విధానం ఎంచుకోవడం వల్ల రాష్ట్రంపై భారం పడింది



తుమ్మిడిహట్టి ద్వారా గ్రావిటీ ద్వారా నీరు అందించే అవకాశం ఉందన్న జూపల్లి

దాన్ని పక్కన పెట్టి కాళేశ్వరంను ఎంచుకున్నారని విమర్శ

మేడిగడ్డ నిరుపయోగంగా మారిందని వ్యాఖ్య

హైదరాబాద్ : కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పర్యటనలో ఉన్న తెలంగాణ పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ప్రధానంగా బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరించిన సాగునీటి విధానాలపై విమర్శలు గుప్పించారు. సహజసిద్ధమైన ప్రవాహం (గ్రావిటీ) ద్వారా నీటిని అందించే అవకాశమున్న తుమ్మిడిహట్టిని పక్కన పెట్టి, కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా విద్యుత్ ఖర్చుతో కూడిన 'లిఫ్ట్' విధానాన్ని ఎంచుకోవడం వల్ల రాష్ట్రంపై భారీ ఆర్థిక భారం పడిందని ఆయన మండిపడ్డారు. 2008లో వైసీపీ హయాంలో 16 లక్షల ఎకరాల లక్ష్యంతో ప్రారంభమైన మిగతా..2లో

## ఏపీ ఈసెట్ ఫలితాలను విడుదల చేసిన మంత్రి నారా లోకేశ్



- ఏపీ ఈసెట్ 2026 ఫలితాలు విడుదల
- మొత్తం 91.72 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత
- ఫలితాలను 'ఎక్స్' వేదికగా ప్రకటించిన మంత్రి నారా లోకేశ్
- అధికారిక వెబ్‌సైట్‌తో పాటు వాట్సాప్‌లోనూ ర్యాంకు కార్డుల వెల్లడి
- బీటెక్ సెకండియర్‌లోకి లేటరల్ ఎంట్రీ కోసం ఈ పరీక్ష

## సూపర్ సిక్స్ పథకాలు, సంక్షేమంపై చంద్రబాబు సమీక్ష

# అధికారులకు కీలక ఆదేశాలు

- రాష్ట్ర సచివాలయంలో కొనసాగుతున్న కలెక్టర్ల సదస్సు
- సూపర్ సిక్స్ పథకాలు, సంక్షేమంపై సీఎం చంద్రబాబు సమీక్ష
- పథకాల అమలు, లబ్ధిదారుల ఇంటిగ్రేషన్‌పై సీఎం దిశానిర్దేశం



అమరావతి : ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఐఐటీ ర్యాంకులు సాధించేలా ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని, జర్మన్ భాషా నైపుణ్యాల ద్వారా వారికి అంతర్జాతీయ ఉపాధి అవకాశాలు కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు లక్ష్యం నిర్దేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో 'సూపర్ సిక్స్' పథకాల అమలుపై సీఎం దిశానిర్దేశం చేశారు. దీపం 2.0 సబ్సిడీని నిర్దేశిత గడువులోగా లబ్ధిదారులకు అందించాలని స్పష్టం చేస్తూ, స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు కల్పిస్తున్న ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని మరింత సమర్థంగా నిర్వహించాలని ఆదేశించారు. తల్లికి వందనం కింద 67 లక్షల మంది విద్యార్థులకు రూ.10 వేల కోట్ల భారీ సాయాన్ని ప్రకటించడంతో పాటు, మిగతా..2లో

# కొత్తగా 12 డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు



రాష్ట్రంలో కిడ్నీ సమస్యలతో ఇబ్బంది పడుతున్న రోగుల కోసం ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు.

అమరావతి, మే 08: రాష్ట్రంలో కిడ్నీ సమస్యలతో ఇబ్బంది పడుతున్న రోగులకు ప్రభుత్వం అండగా ఉంటుందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. శుక్రవారం రాజధాని అమరావతిలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో కొత్తగా 12 డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. మిగతా..2లో

## గంగోత్రి నుంచి గంగాసాగర్ వరకు ఉన్నది బీజేపీ ప్రభుత్వాలే



- టీఎంసీ హింసా రాజకీయాలకు బంగాల్ ప్రజలు చరమగీతం పాడారు
- బీజేపీ విజయాన్ని శ్యామాప్రసాద్ ముఖర్జీకి అంకితం ఇస్తున్నాం
- బంగాల్‌లో అనేక మంది బీజేపీ కార్యకర్తల ప్రాణాలు కోల్పోయారు- కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

ఢిల్లి : బెంగాల్‌లో ప్రధాని మోదీ నేతృత్వంలో అసాధారణ విజయం సాధించామని

## తమిళనాట తొలగిన అనిశ్చితి- విజయ్ కు

# కమ్యూనిస్టులు, వీసీకే మద్దతు!

- ప్రభుత్వ ఏర్పాటుకు విజయ్ సిద్ధం
- మ్యాజిక్ నంబర్ సాధించిన టీవీకే
- గవర్నర్ ను కలిసేందుకు సంసిద్ధం!

ఢిల్లి : తమిళనాడు రాజకీయాలు మరింత రసవత్తరంగా మారుతున్నాయి. ఇప్పటికే కాంగ్రెస్ టీవీకేకు మద్దతు ప్రకటించగా, తాజాగా వీసీకే, సీపీఐ, సీపీఐ(ఎం) పార్టీలు కూడా సపోర్టు చేస్తున్నట్లు ప్రకటించాయి. దీంతో తమిళనాడులో నెలకొన్న రాజకీయ అనిశ్చితికి తెరపడనుంది.

### మ్యాజిక్ ఫిగర్ సాధించిన విజయ్

గత కొన్ని రోజులుగా తమిళనాడులో రాజకీయ అనిశ్చితి కొనసాగుతోంది. విజయ్ తన తొలి అసెంబ్లీ ఎన్నికల్లోనే (108) సీట్లు సంపాదించుకున్నారు. కానీ ప్రభుత్వ ఏర్పాటుకు 118 సీట్లు అవసరం. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ (5సీట్లు) , డీఎంకే నుంచి విడిపోయి విజయ్ పార్టీకి మద్దతు ఇచ్చింది. కానీ మ్యాజిక్ ఫిగర్ సాధించడానికి ఇది సరిపోలేదు. ఈ నేపథ్యంలో




గవర్నర్ టీవీకే ప్రభుత్వ ఏర్పాటుకు ససేమిరా అన్నారు. దీనితో రాజకీయ అనిశ్చితి ఏర్పడింది. మరోవైపు డీఎంకే, ఏఐఏడీఎంకే కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేస్తాయనే ఊహాగానాలు వెలువడ్డాయి. దీనితో పరిస్థితి మరింత రసవత్తరంగా మారింది. అయితే తాజాగా సీపీఐ (2 సీట్లు), సీపీఐ(ఎం) (2 సీట్లు) విజయ్ కు మద్దతు ఇవ్వడానికి సంసిద్ధత వ్యక్తం చేశాయి. వీసీకే (2 సీట్లు) కూడా మద్దతు ఇవ్వడానికి ఇష్టపడుతున్నట్లు తెలుస్తోంది. ఇదే జరిగితే విజయ్ కు మ్యాజిక్ ఫిగర్ (118 సీట్లు) సాధించినట్లు అవుతుంది.

**మద్దతు ఇచ్చినవారికి మంత్రి పదవులు** మిగతా..2లో

## హైదరాబాద్‌లో ప్రధాని మోదీ పర్యటన..

# ఆ ప్రాంతాల్లో డ్రోన్లు ఎగురవేయవద్దు!

- ఎల్లుండి హైదరాబాద్‌కు రానున్న ప్రధాని మోదీ
- బేగంపేట, బోయిన్‌పల్లి, మారేడ్‌పల్లి పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ఆంక్షలు
- రేపు అర్ధరాత్రి నుంచి 24 గంటల పాటు అమల్లో ఆంక్షలు
- డ్రోన్లు, పారా గ్లైడర్లను ఎగురవేయడం నిషేధం



హైదరాబాద్: ఎల్లుండి (మే 10) ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణలో పర్యటించనున్నారు. రాష్ట్రంలో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల్లో పాల్గొంటారు. అనంతరం సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో జరగనున్న బహిరంగ సభలో పాల్గొంటారు. మోదీ పర్యటన నేపథ్యంలో పోలీసులు హైదరాబాద్‌లో పలు ప్రాంతాల్లో ఆంక్షలు విధించారు. బేగంపేట, బోయిన్‌పల్లి, మారేడ్‌పల్లి పోలీస్ స్టేషన్‌ల పరిధిలో రేపు అర్ధరాత్రి 12 గంటల నుంచి 24 గంటల పాటు డ్రోన్‌లు, పారాగ్లైడర్‌లు, రిమోట్ కంట్రోల్ మిగతా..2లో

## కరీంనగర్ ఘటనపై డీజీపీకి బీఆర్ఎస్ నేతల ఫిర్యాదు



- డీజీపీ సీవీ ఆనంద్‌ను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కలిశారు.
- కరీంనగర్‌లో మాజీ మంత్రి గంగుల కమలాకర్ క్యాంప్ కార్యాలయంతో పాటు ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వాహనంపై బీజేపీ కార్యకర్తల దాడి అంశంపై డీజీపీకి బీఆర్ఎస్ నేతలు ఫిర్యాదు చేశారు.

హైదరాబాద్, మే 8: రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్‌ను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్యలపై డీజీపీకి బీఆర్ఎస్ నేతలు ఫిర్యాదు చేశారు. కరీంనగర్‌లో నిన్న(గురువారం) మాజీ మంత్రి గంగుల కమలాకర్ క్యాంప్ కార్యాలయంతో పాటు ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వాహనంపై బీజేపీ కార్యకర్తలు దాడి చేసిన విషయం తెలిసిందే.

## దేశం మొత్తం కొడంగల్ వైపు

# చూసేలా అభివృద్ధి చేస్తా

- దేశం మొత్తం కొడంగల్ వైపు చూసేలా అభివృద్ధి చేస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.
- కొడంగల్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తామని ఉద్ఘాటించారు.



వికారాబాద్, మే 8 : దేశం మొత్తం కొడంగల్ వైపు చూసేలా అభివృద్ధి చేస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కొడంగల్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తామని ఉద్ఘాటించారు. అందరి సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడుపుతున్నామని తెలిపారు. పేదల సంక్షేమం కోసం తాము పనిచేస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని వివరించారు. ఈరోజు (శుక్రవారం) వికారాబాద్ జిల్లాలోని కొడంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. 430 పడకల మిగతా..2లో

## ప్రధాని మోదీ పర్యటనతో తెలంగాణలో

# బీజేపీ మరింత బలోపేతం

- తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి మరోసారి మండిపడ్డారు.
- తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం అందించిన సహకారంపై వీరిద్దరికి అవగాహన లేనట్లు ఉందన్నారు.



హైదరాబాద్, మే 08: తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి మరోసారి మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రానికి మిగతా..2లో

## ప్రతిభ ఆధారంగానే ఉద్యోగాలు వస్తాయి.. అడ్డదారులు తొక్కొద్దు

- వరంగల్‌లో మెగా జాబ్ మేళా నిర్వహించిన ప్రభుత్వం
- యువత మత్తు పదార్థాలకు బానిస కావొద్దన్న కొండా సురేఖ
- ఎన్ని ప్రయత్నాలు విఫలమైనా ఉద్యోగ ప్రయత్నాలు ఆపొద్దన్న కడియం కావ్య



హైదరాబాద్: వరంగల్‌లోని కాళోజీ కళాక్షేత్రంలో నిర్వహించిన మెగా జాబ్ మేళా యువతలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ, మిగతా..2లో

మొదటి పేజీ తరువాయి

## సూపర్ సిక్స్ పథకాలు, సంక్షేమంపై చంద్రబాబు సమీక్ష

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉన్నత విద్యాభ్యాసం కోసం పావలా వడ్డీకే రుణాలను అందించేలా కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు. సంక్షేమ హాస్టళ్లను 'నెట్ జీరో హెల్తీ క్యాంపస్‌లు'గా మార్చి, వ్యర్థాల నిర్వహణ ద్వారా సర్క్యులర్ ఎకానమీని ప్రోత్సహించాలని కలెక్టర్లకు మార్గదర్శకాలను జారీ చేశారు. అరకు కాఫీ, పసుపు వంటి గిరిజన ఉత్పత్తులకు విలువ ఆధారిత ప్రాసెసింగ్ జతచేసి అంతర్జాతీయ బ్రాండ్‌లుగా మార్చాలని, వీటిని పర్యాటక రంగంతో అనుసంధానించాలని పిలుపునిచ్చారు. షాదీఖానాలను 'సద్భావన మండపాలు'గా నామకరణం చేసి, వక్ఫ్ బోర్డు భూముల్లో మైనారిటీ యువతకు నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ఏర్పాటు చేయడం ద్వారా ఆస్తుల వినియోగంతో పాటు ఆదాయ ఉత్పాదకతను పెంచాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు.

## కొత్తగా 12 డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు

ప్రైవేట్ ఏజెన్సీకి టెండర్ ద్వారా వీటి నిర్వహణ చేపడతాయని తెలిపారు. ఇప్పటికే కూటమి పాలనలో 12 డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేశామని ఆయన గుర్తు చేశారు. అదనపు డయాలసిస్ కేంద్రాలతో కలిపి మొత్తం 73 కిడ్నీ సమస్యతో ఇబ్బంది పడుతున్నవారికి అందుబాటులోకి వచ్చాయని మంత్రి సత్యకుమార్ వివరించారు. 'ప్రైమ్ మినిస్టర్ నేషనల్ డయాలసిస్ ప్రోగ్రాం' కింద రాష్ట్రంలోని సెకండరీ ఆసుపత్రుల్లో (జిల్లా, ప్రాంతీయ, సామాజిక) 61 కేంద్రాలు నడుస్తున్నాయని వివరించారు. వీటికి అదనంగా ఈ 12 కేంద్రాలు వస్తున్నాయని తెలిపారు. కొత్త కేంద్రాల రాకతో దూర ప్రాంతాలకు వెళ్లి రక్త శుద్ధి చేయించుకునే రోగులకు అవస్థలు తగ్గుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సేవలు పూర్తిగా ఉచితమని తెలిపారు. ఈ కేంద్రాల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం ఐదేళ్లకు కలిపి సుమారు రూ.30 కోట్ల వరకు ఖర్చు చేస్తుందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ వివరించారు. ఇక ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 2,721పైగా డయాలసిస్ మిషన్లు అందుబాటులో ఉన్నాయి. వాటిలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో 985 మిషన్లు, నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో 1,736 డయాలసిస్ మిషన్లు ఉన్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 21,504 మంది కిడ్నీ సంబంధిత వ్యాధిగ్రస్తులు ఉన్నారు.

## ప్రధాని మోదీ పర్యటనతో తెలంగాణలో
# బీజేపీ మరింత బలోపేతం

కేంద్ర ప్రభుత్వం అందించిన సహకారంపై వీరిద్దరికి అవగాహన లేనట్లు ఉందన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ పన్నెండు ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం నుంచి తెలంగాణ రాష్ట్రానికి అందించిన సహకారంపై తాము ఎప్పుడు చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు. హైదరాబాద్‌లో ప్రధాని మోదీ సభ తరువాత తెలంగాణలో మరింత బలోపేతం అవుతామని కేంద్ర మంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు. ఇది ఎన్నికలకు సంబంధించిన కార్యక్రమం కాదన్నారు. ఇది అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన అంశమని ఆయన పేర్కొన్నారు. రూ. 9 వేల కోట్ల అభివృద్ధి పనులకు మోదీ నేరుగా తెలంగాణలో శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల కంటే ముందే ప్రధాని మోదీ తెలంగాణ పర్యటన ఖరారు అయిందని చెప్పారు. తమిళనాడులో రాజ్యాంగ బద్ధంగా ఏ ప్రభుత్వం అయినా ఏర్పాటు చేయవచ్చునన్నారు.

## హైదరాబాద్‌లో ప్రధాని మోదీ పర్యటన..
## ఆ ప్రాంతాల్లో డ్రోన్లు ఎగురవేయవద్దు!

మైక్రో లైట్ విమానాలు ఎగురవేయడాన్ని నిషేధించారు. ఈ మేరకు మల్కాజ్‌గిరి పోలీసులు 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో పౌరులు ఆంక్షలను పాటించి పోలీసులకు సహకరించాలని కోరారు.

## తమిళనాట తొలగిన అనిశ్చితి-
## విజయ్ కు కమ్యూనిస్టులు, వీసీకే మద్దతు!

ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించిన పార్టీలకు మంత్రి పదవులు ఇవ్వాలని టీవీకే అధినేత విజయ్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా కాంగ్రెస్ కు 2 మంత్రి పదవులు, సీపీఐ, సీపీఐ(ఎం), వీసీకేకు ఒక్కో మంత్రి పదవి ఇవ్వనున్నట్లు సామాచారం. గవర్నర్ ను మరోసారి కలవనున్న విజయ్ మ్యాజిక్ ఫిగర్ (118) సాధించిన నేపథ్యంలో విజయ్ మరోసారి తమిళనాడు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ ను కలివనున్నారని తెలుస్తోంది. ఈ రోజు సాయంత్రం 4.30 గంటలకు గవర్నర్ తో భేటీ అయ్యేందుకు విజయ్ సమయం కోరారని, కీలక పార్టీల మద్దతు తనకు ఉన్నందున ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం కల్పించాలని కోరనున్నారని టీవీకే పార్టీ వర్గాలు తెలిపాయి. మరోవైపు టీవీకే ప్రభుత్వ ఏర్పాటుకు అడ్డంకులు తొలగిపోయిన నేపథ్యంలో ఆ పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నాయి. రాజకీయ చదరంగం తమిళనాడు అసెంబ్లీలో 234 సీట్లు ఉన్నాయి. ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి కావాల్సిన సంఖ్య 118. అయితే తాజా ఎన్నికల్లో టీవీకే పార్టీ 108 స్థానాల్లో గెలిచింది. అయితే విజయ్ రెండు స్థానాల్లో పోటీ చేసి గెలవడం వల్ల ఒక దానికి రాజీనామా చేయక తప్పనిపరిస్థితి. అందుకే ప్రస్తుతం ఆ పార్టీ బలం 107 సీట్లుగా ఉంది. ఇక డీఎంకేకు 59 సీట్లు, ఏఐఏడీఎంకేకు 47 సీట్లు వచ్చాయి. కాంగ్రెస్ -5. పీఎంకే- 4, సీపీఐ-2, సీపీఐ(ఎం)- 2, వీసీకే- 2, ఐయూఎంఎల్ -2, బీజేపీ-1, డీఎండీకే-1, ఏఎంఎంకే-1 స్థానాల్లో గెలిచాయి.

## గంగోత్రి నుంచి గంగాసాగర్
## వరకు ఉన్నది బీజేపీ ప్రభుత్వాలే

కేంద్ర హోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. గంగోత్రి నుంచి గంగాసాగర్ వరకు బీజేపీ ప్రభుత్వాలు ఏర్పాటయ్యాయని చెప్పారు. బంగారు బెంగాల్ కోసం శ్రమిస్తామని హామీ ఇచ్చారు. కమ్యూనిస్టుల హింసా వారసత్వాన్ని టీఎంసీ కొనసాగించిందన్నారు. టీఎంసీ హింసా రాజకీయాలకు బంగాల్ ప్రజలు చరమగీతం పాడారని ప్రకటించారు. హింస, బెదిరింపుల ఘటనలు ఎన్నో జరిగినా, బంగాల్ ఎన్నికల్లో ప్రజలు బీజేపీపై విశ్వాసం ఉంచారని ఆయన కొనియాడారు. అయితే, బంగాల్ ఎన్నికల్లో విజయం చాలా ముఖ్యమైనదని, ఈ భారీ మెజారిటీతో తమ బాధ్యత మరింత పెరిగిందని ఆయన పేర్కొన్నారు. బంగాల్‌లో బీజేపీ శాసనసభ పక్ష నాయకుడిగా సువేందు అధికారి ఎన్నికైన నేపథ్యంలో షా ఈ మేర వ్యాఖ్యానించారు. "ముందుగా నేను బంగాల్ ప్రజలకు నా కృతజ్ఞతలు తెలియజేయాలనుకుంటున్నాను. కమ్యూనిస్ట్ యుగం నుంచి ఇక్కడ నెలకొన్న వాతావరణం మమత పాలనలో మరింత భయానకంగా మారింది. అటువంటి పరిస్థితుల్లో ఓటు వేయడం దాదాపు అసాధ్యంగా మారింది. వందలాది హింసాత్మక, క్రూరమైన ఘటనలు జరిగినప్పటికీ, బంగాల్ ప్రజలు బీజేపీ, మోదీపై నమ్మకం ఉంచి మాకు భారీ విజయాన్ని అందించారు. అందుకు నేను కృతజ్ఞుడను."

## ఈ-ఫైళ్ల పరిష్కారంలో అచ్చెన్నాయుడు నెంబర్ వన్

ఆ సమయాన్ని 2 గంటల 49 నిమిషాలకు తగ్గించారు. పరిపాలనలో జాప్యాన్ని తగ్గించి, ప్రజలకు త్వరితగతిన సేవలు అందించడమే లక్ష్యంగా ఆయన పనిచేస్తున్న తీరును కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ప్రశంసించారు. ప్రభుత్వ యంత్రాంగంలో ఈ-ఫైళ్ల విధానం అమలులోకి రావడం వల్ల ఫైళ్లు ఎక్కడ ఆగిపోయాయో ఎప్పటికప్పుడు పర్యవేక్షించే వీలుంటుంది. అచ్చెన్నాయుడు నాయకత్వంలో వ్యవసాయ శాఖ ఈ సాంకేతికతను సమర్థవంతంగా వాడుకుంటూ ముందంజలో ఉందని అధికారులు చెబుతున్నారు. రోజుల తరబడి పెండింగ్‌లో ఉండే ఫైళ్లు ఇప్పుడు గంటల వ్యవధిలోనే పరిష్కారం కావడం అనేది పాలనలో పారదర్శకతకు నిదర్శనం.ఒక మంత్రి స్థాయిలో ఫైళ్లు ఇంత వేగంగా క్లియర్ అవ్వడం వల్ల కింది స్థాయి అధికారులపై కూడా సానుకూల ప్రభావం పెరుగుతుంది. రైతులకు సంబంధించిన పథకాలు, రాయితీలు లేదా ఇతర అనుమతులు త్వరగా మంజూరు కావడానికి ఈ వేగం ఎంతగానో దోహదపడుతుంది.

## బీఆర్ఎస్ ప్రభుత్వం లిఫ్ట్ విధానం ఎంచుకోవడం
## వల్ల రాష్ట్రంపై భారం పడింది



ఈ ప్రాజెక్టును కాళేశ్వరం పేరుతో రీ-డిజైన్ చేయడం వల్ల సిర్పూర్, ఆసిఫాబాద్, బెల్లంపల్లి ప్రాంతాల రైతులకు అన్యాయం జరిగిందని మంత్రి పేర్కొన్నారు. మేడిగడ్డ పిల్లర్లు కుంగిపోవడంతో ప్రస్తుతం ఆ ప్రాజెక్టు నిరుపయోగంగా మారిందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం తుమ్మిడిహట్టిని పూర్తి చేయడానికి సిద్ధంగా ఉందని జూపల్లి స్పష్టం చేశారు. 150 మీటర్ల బరాజ్ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించే ప్రయత్నం చేస్తామని, దీనివల్ల పొరుగు రాష్ట్రంలో ముంపు సమస్య ఉండదని ఆయన వివరించారు.

# దేశం మొత్తం కొడంగల్ వైపు చూసేలా అభివృద్ధి చేస్తా

మొదటి పేజీ తరువాయి

ఆస్పత్రి నిర్మాణం, దౌల్తాబాద్ వేంకటేశ్వర ఆలయం, కోస్గి వేణుగోపాలస్వామి ఆలయాల అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరి, పలువురు నేతలు పాల్గొన్నారు.

### తెలంగాణ పేదల తిరుపతిగా అభివృద్ధి చేస్తా..

ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. పేదల తిరుపతిగా పేరుగాంచిన కొడంగల్ శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణం చేయటం అదృష్టమని చెప్పుకొచ్చారు. తెలంగాణ పేదల తిరుపతిగా ఈ ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ నియోజకవర్గాన్ని నందనవనంగా మార్చటానికి అందరు కలిసి రావటం అభినందనీయమని తెలిపారు. ఆగమశాస్త్ర పండితుడు సుందరవరదాచార్యులు కలలుగన్న గుడి నిర్మాణం సహకారం కావటం సంతోషమని చెప్పారు.



### ఆ ఎత్తిపోతల పథకానికి భూసేకరణ పూర్తి..

తిరుపతిలో ఏ రకమైన పూజలు జరుగుతాయో ఇక్కడ అలాగే పూజలు జరుగుతాయని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ గుడికి కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు వస్తారని.. దీంతో కొడంగల్‌కు దేశంలో గుర్తింపు వస్తోందని తెలిపారు. కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పథకానికి భూసేకరణ పూర్తయిందని తెలిపారు ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి నిధుల కొరత లేదన్నారు. ఈ ఎత్తిపోతల పథకానికి భూసేకరణ పూర్తయిందని.. అనుమతులు వచ్చాయని, ఏడాదిన్నరలోపు పూర్తి చేద్దామని చెప్పుకొచ్చారు. కృష్ణ- వికారాబాద్ రైల్వేలైన్ త్వరలో పూర్తవుతుందని స్పష్టం చేశారు. రేకులపాడు ప్రాంతంలో సిమెంట్ పరిశ్రమలను ఆరు నెలల్లో ఏర్పాటు చేసి ఉపాధి కల్పిస్తామని అన్నారు.

### లగచర్ల వద్ద విద్యాహబ్..

220 ఎకరాల్లో లగచర్ల వద్ద విద్యాహబ్‌గా మారుస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు. ఇక్కడ అనేక విద్యాసంస్థలు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. రాజకీయాలు ఎన్నికల సమయంలో ఉండాలని.. ఆ తర్వాత అందరం కలిసి పనిచేయాలని సూచించారు. 2034 వరకు గుంపులు, గ్రూపులు పక్కన పెట్టాలని.. అభివృద్ధికి బాటలు వేద్దామని పిలుపునిచ్చారు. కొడంగల్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుకుందామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# కరీంనగర్ ఘటనపై డీజీపీకి బీఆర్ఎస్ నేతల ఫిర్యాదు

మొదటి పేజీ తరువాయి

ఈ అంశంపై డీజీపీకి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ నేతలపై దాడులను అరికట్టాలని, శాంతిభద్రతలను కాపాడాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

### అలా ప్రశ్నించినందుకే దాడులు: దాసోజు శ్రవణ్

కరీంనగర్‌లో కౌశిక్ రెడ్డి, గంగుల కమలాకర్‌పై దాడిని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ ఖండించారు. రాష్ట్రంలో జరుగుతున్న దాడులపై డీజీపీ సీవీ ఆనంద్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసీఆర్ కొడుకువే నా అని కేటీఆర్‌ను ప్రశ్నించడం సరైందని కాదని కౌశిక్ రెడ్డి ప్రశ్నించినందుకే దాడులు చేశారని ఆరోపించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ తంబాకు తింటాడని అన్నందుకే దాడులు చేస్తారా అని నిలదీశారు. కేంద్ర హోం సహాయ మంత్రిగా ఉండి శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా బండి సంజయ్ వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు అదుపు తప్పాయని భావిస్తున్నామని దాసోజు శ్రవణ్ వ్యాఖ్యానించారు.

### తగిన గుణపాఠం చెబుతాం: వివేకానంద గౌడ్

బండి సంజయ్, ముఖ్యమంత్రి చీకటి ఒప్పందాలు.. వ్యాపారాలు అందరికి తెలుసని ఎమ్మెల్యే వివేకానంద గౌడ్ వ్యాఖ్యలు చేశారు. బండి సంజయ్‌కు అహకారం పెరిగిందన్నారు. 'మీ భాషపై మీ భాషలో చెబితే దాడులు చేస్తారా. కౌశిక్ రెడ్డి ఏమి తప్పు మాట్లాడారో చెప్పాలి. వచ్చేది మా ప్రభుత్వం. అప్పుడు బండి సంజయ్ గుజరాత్ వెళ్లి దాక్కోవాలి. అన్ని ఆధారాలను డీజీపీకి ఇచ్చాం. రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం చెబుతాం' అని వివేకానంద గౌడ్ హెచ్చరించారు.

### శాంతిభద్రతలు దిగజారిపోయాయి: పల్లా రాజేశ్వర్ రెడ్డి

తెలంగాణ రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా దిగజారిపోయాయని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. వెనుకబడిన రాష్ట్రాలలో ఏ విధంగా ఉన్నదో అదే తెలంగాణలో ఉందన్నారు. నచ్చని రాజకీయ పార్టీల నేతల కార్యాలయాలు, ఇళ్లపై దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. కరీంనగర్‌లో పోలీసుల చేతగానితనాన్ని డీజీపీకి వివరించినట్లు తెలిపారు. నిన్ను కౌశిక్ రెడ్డిని చంపాలని వచ్చారన్నారు. బండి సంజయ్ రెచ్చగొడితేనే కార్యకర్తలు వచ్చారని.. ఆయనపై కేసు నమోదు చేయాలని పల్లా రాజేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు.




# ఏపీ ఈసెట్ ఫలితాలను విడుదల చేసిన మంత్రి నారా లోకేశ్

మొదటి పేజీ తరువాయి

అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో ఇంజినీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీ ఈసెట్-2026) ఫలితాలు విడుదలయ్యాయి. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శుక్రవారం ఈ ఫలితాలను 'ఎక్స్' వేదికగా అధికారికంగా ప్రకటించారు. ఈ పరీక్షలో మొత్తం 91.72 శాతం ఉత్తీర్ణత నమోదైనట్టు ఆయన వెల్లడించారు. ఈ ఏడాది ఏప్రిల్ 23న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఈ ప్రవేశ పరీక్షకు మొత్తం 32,434 మంది విద్యార్థులు హాజరు కాగా, వారిలో 29,750 మంది అర్హత సాధించారు. ఈసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులందరికీ మంత్రి లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు. పాలిటెక్నిక్, డిప్లొమా కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు నేరుగా బీటెక్, బీఈ కోర్సుల ద్వితీయ సంవత్సరంలో చేరేందుకు (లేటరల్ ఎంట్రీ) ఈసెట్ ప్రవేశ పరీక్షను నిర్వహిస్తారు. దీని ద్వారా విద్యార్థులు ఒక విద్యా సంవత్సరాన్ని ఆదా చేసుకునే అవకాశం కలుగుతుంది. ఈసెట్‌లో సాధించిన ర్యాంకు ఆధారంగా రాష్ట్రంలోని వివిధ ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశాల ప్రక్రియ జరుగుతుంది. ఫలితాలు, ర్యాంకు కార్డులను విద్యార్థులు అధికారిక వెబ్‌సైట్ ఙ్వం.ఛజూంఎ్టవ.ఛజూ.స్ర్తీజ.జుఅ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దీంతో పాటు, విద్యార్థులకు మరింత సౌలభ్యంగా ఉండేందుకు ప్రభుత్వం ఈసారి వాట్సాప్ సేవలను కూడా అందుబాటులోకి తెచ్చింది. తమ ఫోన్‌లోని వాట్సాప్ నుంచి 9552300009 నంబర్‌కు సందేశం పంపి కూడా ర్యాంకు కార్డును సులభంగా పొందవచ్చు. ఫలితాల విడుదల ప్రక్రియ పూర్తవడంతో, త్వరలోనే అడ్మిషన్ల కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ఉన్నత విద్యామండలి విడుదల చేయనుంది. విద్యార్థులు తదుపరి ప్రకటనల కోసం అధికారిక వెబ్‌సైట్‌ను గమనిస్తూ ఉండాలని అధికారులు సూచించారు.



# ప్రతిభ ఆధారంగానే ఉద్యోగాలు వస్తాయి.. అడ్డదారులు తొక్కొద్దు

మొదటి పేజీ తరువాయి

ఎంపీ కడియం కావ్య చేసిన ప్రసంగాలు నిరుద్యోగులకు దిశానిర్దేశం చేశాయి. యువత ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసే మత్తుపదార్థాలకు బానిస కావొద్దని కొండా సురేఖ గట్టిగా హెచ్చరించారు. నేటి తరంలో సామాజిక మార్పులు వేగంగా వస్తున్నాయని, యువత నిబద్ధతతో పనిచేస్తూ తమ ప్రతిభను మెరుగుపరుచుకోవాలని సూచించారు. కేవలం ప్రతిభ ఆధారంగానే ఉద్యోగాలు వస్తాయని, అడ్డదారులు తొక్కొద్దని ఆమె హితవు పలికారు. ముఖ్యంగా ఉద్యోగ నియామకాల్లో మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె ఈ సందర్భంగా ఆకాంక్షించారు. నిరుద్యోగ యువతలో ఉండే మానసిక ఒత్తిడిపై ఎంపీ కడియం కావ్య స్పందించారు. యువత ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా ఉండాలని, ప్రతిరోజూ మనలో మనం యుద్ధం చేసుకుంటూ మనల్ని మనం మెరుగుపరుచుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఎన్ని విఫలయత్నాలు ఎదురైనా ఉద్యోగ ప్రయత్నాలను ఆపకూడదని, కష్టపడితేనే జీవితంలో ఉన్నత స్థితికి చేరుకుంటారని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. "మనం తప్పు చేయనంత కాలం ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదు" అని మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు నిరుద్యోగుల్లో ధైర్యాన్ని నింపాయి. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా జరిగిన ఈ మెగా జాబ్ మేళాకు నిరుద్యోగులు భారీగా హాజరయ్యారు. కలెక్టర్ సత్యశారదదేవి, ఎమ్మెల్యే నాగరాజు మరియు ఇతర ముఖ్య నేతలు పాల్గొన్న ఈ కార్యక్రమం, వరంగల్ ప్రాంత యువతకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో నిర్వహించారు.



## ఆగస్టు నాటికి మూసీ పునరుజ్జీవ పనులు స్టార్ట్!
# తొలి దశలో రూ.7,055 కోట్లతో అభివృద్ధి

మూసీ ప్రాజెక్టుపై మంత్రివర్గ ఉపసంఘం సమావేశం

మూసీ డీపీఆర్ వివరాలను మంత్రులకు అందించిన అధికారులు

– తొలి దశలో చేపట్టే పనులకు ఏడీబీతో చర్చలు ముగిసినట్లు వెల్లడి

ఢిల్లీ : మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు పనులను ఆగస్టు నాటికి ప్రారంభించాలని అధికారులను మంత్రివర్గ ఉపసంఘం ఆదేశించింది. ప్రజల ఆస్తులపై ప్రభావం లేని ఐదు కిలోమీటర్ల మేర పనులు చేపట్టాలని తెలిపింది. నిర్మాణాలపై ఎక్కువ ప్రభావం లేకుండా అలైన్‌మెంట్‌లు మార్చాలని సూచించింది. ప్రాజెక్టులో భాగంగా మూసీలో పలు చోట్ల టూరిజం స్పాట్లుగా ఆకర్షించేలా రబ్బర్ డ్యాంలను నిర్మించేలా ప్రణాళిక చేశారు. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుపై నెలకొన్న అనుమానాలు నివృత్తి చేయాలని, ప్రయోజనాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని అధికారులకు కేబినెట్ సబ్ కమిటీ దిశానిర్దేశం చేసింది. ప్రజాభవన్‌లో మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుపై కేబినెట్ సబ్ కమిటీ ఛైర్మన్ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సభ్యులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ సమావేశమై ప్రాజెక్టు పురోగతి, నిధుల సమీకరణ, నిర్మాణ పనుల క్యాలెండర్ పై చర్చించారు. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు డీపీఆర్‌ను మంత్రులకు వివరించిన అధికారులు, ఐదు దశల్లో 55 కిలోమీటర్ల వరకు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. రిటైనింగ్ వాల్స్ : ప్రాజెక్టులో భాగంగా మూసీలో చెత్త తొలగించి శుభ్రపరచడం, రివర్ బెడ్ ప్రొఫైలింగ్ చేయడం, వరద నియంత్రణ కోసం రిటైనింగ్ వాల్స్, నదికి రెండు వైపులా రోడ్లు, ప్రధాన మురుగు నీటి కాలువలు, నీటి నిల్వ కోసం బ్యారేజీలు, నార్సింగి నుంచి గౌరెల్లి వరకు 55 కిలోమీటర్ల మేర ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం, రివర్ ఫ్రంట్ అభివృద్ధి ఉంటాయన్నారు. సుమారు రూ.7.55 వేల కోట్లతో చేపట్టనున్న మొదటి ఫేజ్ నిధుల సమీకరణపై ఆసియా అభివృద్ధి బ్యాంక్ తో సాంకేతిక, ఆర్థిక చర్చలు విజయవంతంగా ముగిశాయని అధికారులు వివరించారు. మొదటి ఫేజ్ లో హిమాయత్ సాగర్ నుంచి బాపుఘాట్ ఉస్మాన్ సాగర్ నుంచి బాపుఘాట్ వరకు 21 కిలోమీటర్ల మేరకు అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. ఉప్పల్ భగాయత్ నుంచి గౌరెల్లి వరకు ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ తయారీ దశలో ఉందని అధికారులు తెలిపారు.



ప్రజల ఆస్తులపై ప్రభావం లేని ఐదు కిలోమీటర్లలో వెంటనే పనులను ప్రారంభించాలని మంత్రులు అదేశించారు. మొదటి ఫేజ్ పనులను ఆగస్టు నాటికి ప్రారంభించి, వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి చేసేలా లక్ష్యం పెట్టుకోవాలని మంత్రులు ఆదేశించారు. దీనికి సంబంధించిన పూర్తి క్యాలెండర్‌ను సమర్పించాలని ఉప ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. విస్తృతంగా ప్రచారం చేయాలి : పర్యావరణ అనుమతులను తీసుకోవాలని అధికారులకు మంత్రులు చెప్పారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం భూమిని రక్షణ శాఖ నుంచి తీసుకొనే ప్రక్రియ వేగవంతం చేయాలని తెలిపారు. మూసీ పునరుజ్జీవనం వల్ల కలిగే ఉపయోగాలపై నగరంలో విస్తృతంగా ప్రచారం చేయాలని మంత్రులు అధికారులకు సూచించారు. బస్టాండ్లు, మెయిన్ రోడ్లపై హోర్డింగ్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సినిమా థియేటర్ లో కూడ వీడియోలను ప్రదర్శించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వివిధ విభాగాల మధ్య సమన్వయం కోసం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. పురోగతి స్పష్టంగా కనిపించేలా నిర్దేశిత కాలవ్యవధిలో పనుల నిర్మాణం జరగాలని మంత్రి శ్రీధర్ బాబు అధికారులకు సూచించారు. ప్రజాభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని ఎవరికి ఇబ్బంది కలుగకుండ నిర్మాణ పనులను చేపట్టాలన్నారు. సాంకేతికపరమైన అంశాల్లో ఐఐటి, జేఎన్టీయూ నుంచి తగిన సహకారం తీసుకోవాలని శ్రీధర్ బాబు సూచించారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని నిర్మాణ పనులకు ఆటంకాలు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. రబ్బర్ డ్యాంల ఏర్పాటు : నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను తప్పని సరిగా పాటించేలా నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. మూసీ పునర్జీవం ప్రాజెక్టులో భాగంగా నదిలో పలు చోట్ల చెక్ డ్యాంల తరహాలో రబ్బర్ డ్యాంలను ఏర్పాటు చేయనున్నారు. నీటి నిల్వను పెంచడంతో పాటు జల క్రీడలు, బోటింగ్ సదుపాయాలతో టూరిజం స్పాట్‌లుగా తీర్చిదిద్దేలా ప్రణాళిక చేసినట్లు అధికారులు వివరించారు. ఒబెర్‌మెయర్ స్పిల్‌వే గేట్ టెక్నాలజీ సంస్థ రూపొందించిన రబ్బర్ డ్యాం నమూనాను ప్రజా భవన్ లో మంత్రులు పరిశీలించారు. నాసిక్, ముంబయి నగరాల్లో ఈ సంస్థ నిర్మించిన రబ్బర్ డ్యాంలను అధ్యయనం చేయాలని అధికారులకు మంత్రులు తెలిపారు. మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు కేవలం ఒక నది ప్రక్షాళన మాత్రమే కాదని ఒక సామాజిక బాధ్యత అని కేబినెట్ సబ్ కమిటీ స్పష్టం చేసింది. అభివృద్ధి అంటే మనుషులను దూరం చేయడం కాదని వారిని భాగస్వాములను చేయడమేనని పేర్కొంది. మూసీ ప్రాజెక్టును అత్యంత పారదర్శకంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో ముందుకు తీసుకెళ్లాలని అధికారులకు మంత్రివర్గ ఉపసంఘం స్పష్టం చేసింది. ప్రజల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేసి విశ్వసనీయత కల్పించేలా కార్యచరణ ఉండాలని సబ్ కమిటీ ఆదేశించింది. జీవన ప్రమాణాలు మెరుగ్గా : ప్రజా ప్రయోజనాలను కాపాడటమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత తెలిపింది. ప్రజల ఆస్తులు, నిర్మాణాలపై అతి తక్కువ ప్రభావం పడేలా ఆలైన్ మెంట్‌ను మార్చుకోవాలని మంత్రివర్గ ఉపసంఘం సూచించింది. అత్యంత జాగ్రత్తగా ప్రణాళికలు రూపొందించి, ప్రజలకు అసౌకర్యం కలగకుండా ప్రాజెక్టు పనులను చేపట్టాలని అధికారులను ఆదేశించింది. నగర రూపురేఖలు మారడమే కాకుండా పరీవాహక ప్రాంత ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతాయని, ప్రజల భాగస్వామ్యంతోనే మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు సాకారం అవుతుందని దిశానిర్దేశం చేసింది. అభివృద్ధి, ప్రజా హితం రెండూ సమాంతరంగా సాగాలని కేబినెట్ సబ్ కమిటి అధికారులకు స్పష్టం చేసింది. సమావేశంలో ఉన్నతాధికారులు జయేశ్ రంజన్, ఈవీ నర్సింహారెడ్డి, కృష్ణ భాస్కర్, అశోక్ రెడ్డి, గౌతమి, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## విపక్ష రహిత భారత్.. ఏ వెల్గులకు?

పన్నెండు సంవత్సరాల క్రితం భారతీయ జనతా పార్టీ అధ్యక్ష పదవీ బాధ్యతలు చేపట్టిన అమిత్ షా తరచు 'కాంగ్రెస్‌ముక్త్ భారత్' (కాంగ్రెస్ లేని భారత్) గురించి మాట్లాడుతుండేవారు. అమిత్ మహాశయుని ఘోష ఒక విశ్వసనీయ మార్గదర్శక ప్రణాళికను కాకుండా కేవలం ఒక రాజకీయ బూకరింపును సూచించేది. ద్వాదశ సంవత్సరాలు గడిచిపోయాయి. కాంగ్రెస్‌ముక్త్ భారత్ మహాలక్ష్యం ఇప్పుడు వడివడిగా 'ప్రతిపక్షముక్త్ భారత్' (ప్రతిపక్షాలు లేని భారత్) అనే సాహసోపేత లక్ష్య పరిపూర్తికి శీఘ్రగతిన పురోగమిస్తోందని ఆయన వాదించవచ్చు. 2026 అసెంబ్లీ ఎన్నికల తీర్పులో పొరపడేందుకు వీలులేని సందేశం ఏదైనా ఒకటి ఉంటే అది ఇది మాత్రమేనని చెప్పవచ్చు: 2014లో నరేంద్ర మోదీ ప్రధానమంత్రి అయిన తరువాత మరెన్నడు లేని విధంగా భారతీయ జనతా పార్టీ ఇప్పుడు దేశ రాజకీయాలలో అత్యంత ప్రాబల్య, ప్రభావదాయక శక్తిగా వెలుగొందుతోంది. ఇది వాస్తవమే అయినా అందుకు మినహాయింపులూ ఉన్నాయి. తమిళనాడు, కేరళలో బీజేపీయేతర, ఎన్డీయేతర ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చాయి. తమిళనాడు అప్పటికీ ఇప్పటికీ ఒక విశిష్ట రాష్ట్రంగా ఉన్నది. సినిమా విడుదలైన మొదటి రోజు మార్నింగ్ షోనే చూసితీరాలని అశేష ప్రజలు ఆరాటపడేలా చేసే సినీ హీరో రాజకీయాలలోకి ప్రవేశించి తొలి ఎన్నికలలోనే అద్వితీయ విజేతగా వెలుగొందడం తమిళనాడులో మాత్రమే సాధ్యమయ్యే అద్భుతం. సరే, కేరళ తన ప్రత్యేక శైలిలో పయనిస్తూనే ఉన్నది. ఆ రాష్ట్రంలో బీజేపీ ఇప్పటికీ అధికారానికి ఒక ప్రధాన పోటీదారుగా ప్రభవించనే లేదు. ఇప్పుడు జాతీయ రాజకీయ దృశ్యాన్ని చూద్దాం. భారతీయ జనతా పార్టీ, దాని మిత్రపక్షాలు దేశవ్యాప్తంగా 21 రాష్ట్రాలలో అధికారంలో ఉన్నాయి. అరేబియా సముద్రం నుంచి బంగాళాఖాతం దాకా దేశ రాజకీయ పటం కాషాయ వర్ణంలో కనిపిస్తోంది. ఇందుకు జార్ఖండ్ ఒక్కటి మాత్రమే మినహాయింపు. 2026 అసెంబ్లీ ఎన్నికల తీర్పు బీజేపీకి మరింత ప్రాధాన్యాన్ని సమకూర్చింది. కేవలం రెండు సంవత్సరాల క్రితం లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ఏక పార్టీ ఆధిపత్యం దిశగా భారత్ ప్రస్థానాన్ని నిలువరించడం సాధ్యమేనన్న ఆశాభావాన్ని కలిగించాయి. కాంగ్రెస్ పునరుత్థానమయింది. ప్రతిపక్ష 'ఇండియా' కూటమిలోని పలు ప్రాంతీయ పార్టీలు చెప్పుకోదగ్గ విజయాలు సాధించాయి. కాంగ్రెస్, దాని మిత్ర పక్షాలు పోటీదాయక, బహుపార్టీ రాజకీయాలకు ఊపిరి పోయగలవని ప్రజాస్వామ్య భారత హితైషులు అందరూ విశ్వసించారు. కాల వైపరీత్యం! రెండు సంవత్సరాలకే ఆ ఆశ అడుగంటిపోయింది.. ఆ ఆశాభావం నిజమయేందుకు ఆస్కారం లేదనే భావనకు ఇటీవలి పరిణామాలు తావిచ్చాయి. గత 24 నెలల్లో ప్రతిపక్ష 'ఇండియా' కూటమిలోని కీలక భాగస్వామ్యపక్షాలు వరుసగా తీవ్ర పరాజయాలపాలయ్యాయి. మహారాష్ట్రలో శివసేన (యూబీటీ) చిత్తుగా ఓడిపోయింది. ఆమ్ ఆద్మీ పార్టీ ఢిల్లీలో అధికారాన్ని కోల్పోయింది. బిహార్‌లో రాష్ట్రీయ జనతాదళ్ ప్రాధాన్యం తగ్గిపోయింది. ఒడిషాలో బిజూ జనతాదళ్ సుదీర్ఘ పాలన హఠాత్తుగా అంతమయింది. తమిళనాడులో డీఎంకే, పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ అధికార కంచుకోటలు కూలిపోయాయి. ఒకప్పుడు ప్రతిపక్షాల సమైక్యతా నిర్మాతగా భాసిల్లిన నితీశ్‌కుమార్ ఇప్పుడు బీజేపీ రాజకీయ దయాదాక్షిణ్యాలపై ఆధారపడుతున్నారు. ఈ పరాజయాలు యాదృచ్ఛికమైనవీ కావు, తాత్కాలికమైనవీ కావు. దేశ రాజకీయ వ్యవస్థ ప్రాథమిక వైఫల్యాన్ని అవి సూచిస్తున్నాయి, సందేహం లేదు. వ్యవస్థాగత మార్పులు రాని పక్షంలో పరిస్థితి మరింతగా దిగజారిపోతుందని అవి స్పష్టంగా హెచ్చరిస్తున్నాయి. స్వాతంత్ర్యానంతర భారతదేశంలో మహా శక్తిమంతమైన ఎన్నికల యంత్రంగా పరిణమించిన పార్టీ బీజేపీ. సైద్ధాంతిక స్పష్టత లేదా నిర్ణయాత్మక నాయకత్వం కాకుండా ఆ పరిణామమే బీజేపీని ప్రస్తుతం ఒక విభిన్న, విలక్షణ పార్టీగా నిలుపుతోంది. లక్ష్య సాధనలో నిరంతర నిమగ్నత, పరిస్థితులకు అనుగుణంగా మారడం, భావోద్వేగాలకు అతీతంగా వ్యవహరించడం ఆ పార్టీని అజేయంగా ఉంచుతున్నాయి. అది జయించలేని ప్రాంతం ఏదీ లేదు, దాని ఆకాంక్ష ఏదీ నెరవేర్చుకోలేనిదీ కాదు. పశ్చిమ బెంగాల్ ఇందుకొక దృష్టాంతం. 2011లో ఆ రాష్ట్ర శాసనసభలో ఒక్క సీటునూ గెలుచుకోలేకపోయిన బీజేపీ 2026లో 200కు పైగా స్థానాలను కైవసం చేసుకున్నది. నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు పదిహేను సంవత్సరాల పాటు చేసిన నిర్విరామ కృషి ఫలితమే బెంగాల్‌లో లభించిన మహావిజయం. ఈ చరిత్రాత్మక విజయంతో బెంగాల్ రాజకీయ జగత్తులో ఒక సుస్థిర, శాశ్వత ఉనికిని బీజేపీ సముపార్జించుకున్నది. ఒక పద్ధతి ప్రకారం క్షేత్ర స్థాయిలో ప్రజల సమీకరణ, బహుళ అంచెల వ్యూహం, బలమైన కేంద్ర నాయకత్వం బీజేపీ ఎదుగుదలకు దోహదం చేశాయి. బెంగాల్‌లో అధికార కైవసం బీజేపీకి కేవలం మరో విజయం మాత్రమే కాదు, మతపరమైన గుర్తింపు, సంక్షేమ పథకాలు, క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకలాపాలను ఎడతెగకుండా పటిష్ఠంగా నిర్వహించే సామర్థ్యాన్ని మిళితం చేసిన బీజేపీ విజయ సూత్రానికి తిరుగులేని ధ్రువీకరణే ఆ చరిత్రాత్మక గెలుపు అని చెప్పితీరాలి. ఈ జైత్రయాత్ర క్రమంలో రాజకీయ కవచంగా సాంస్కృతిక ఉపజాతీయవాద పరిమితులు బహిర్గతయ్యాయి. ఢిల్లీ నుంచి వచ్చిన 'బయటి మనుషుల'కు వ్యతిరేకంగా బెంగాల్ ఆత్మగౌరవ పరిరక్షణకు పోరాడుతున్న 'బెంగాల్ పుత్రిక'గా తనను తాను నిలుపుకోవడం ద్వారా మమతా బెనర్జీ 2021లో విజయం సాధించారు. అయితే ఈ అస్తిత్వఆధారిత కథనాల ప్రభావశీలత శాశ్వతమైనది కాదు. ఈ సత్యాన్ని గుర్తించిన బీజేపీ ఇటీవలి ఎన్నికల పోరులో తన వ్యూహాన్ని మార్చుకుని అక్రమ వలసలు, స్థానిక అవినీతి, పాలనలో అలసట, అసమర్థత మొదలైన అంశాలకు అగ్ర ప్రాధాన్యమిచ్చింది.

# ప్రగతి విస్తరణకు పెద్ద అడ్డంకి!



గతంలో ఎన్నడూ లేనంత భారీ స్థాయిలో భారతదేశంలో నేడు మౌలిక వసతుల విస్తరణ జరుగుతోంది. కానీ, చాలా చోట్ల శ్రామికుల కొరత తీవ్రంగావేధిస్తోంది. దానివల్ల ప్రాజెక్టుల భవితవ్యం సందిగ్ధంలో పడుతోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలతో సహా దేశమంతటా రహదారులు, రేవులు, రైల్వేలు, విమానాశ్రయాలు, సాగునీటి ప్రాజెక్టులు నిర్మితమవుతున్నాయి. కొత్త పట్టణ కేంద్రాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. ఏపీలో రాజధాని అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు, జాతీయ రహదారుల విస్తరణ, ఓడరేవుల అభివృద్ధి; హైదరాబాద్‌లో నివాసం, వాణిజ్యం కోసం నిర్మిస్తున్న ఆకాశహర్మ్యాలు ఇవన్నీ మౌలిక వసతుల పురోగతికి నిదర్శనాలు. అయితే, మిరుమిట్లు గొలిపే ఈ వృద్ధి వెనక తక్షణం దృష్టి సారించాల్సిన సమస్య ఒకటి ఉంది. అదే నిపుణ కార్మికులకు, నైపుణ్యం లేని శ్రామికులకు నెలకొన్న కొరత. చాలా చోట్ల స్థానికులు ఆయా పనులను ఇష్టపడకపోతుండటంతో సమస్య అపరిష్కృతంగా మిగిలిపోతోంది.

విస్తృత ఆర్థిక ప్రభావాలు

నిర్మాణ రంగంలో శారీరక శ్రమతో కూడిన పనులే విరివిగా అందుబాటులోకి వస్తాయి. వాటిని చేయడానికి స్థానికులు ఆసక్తి చూపకపోవడంతో ఒడిశా, ఝార్ఖండ్, బిహార్, పశ్చిమ బెంగాల్, అస్సాం, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాల నుంచి వస్తున్న వలస కార్మికులే కీలకంగా మారుతున్నారు. మిగతా దేశంతో పాటు రెండు తెలుగు రాష్ట్రాల్లో జరుగుతున్న నిర్మాణ పనుల్లో కూడా వలస కార్మికులే అత్యధికంగా కనిపిస్తున్నారు. ఈ పరిస్థితి హైదరాబాద్, విశాఖపట్నం వంటి నగరాల్లో మరీ కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. తాపీ మేస్త్రీలు, ఎలక్ట్రీషియన్లు, ఇతర నిపుణ కార్మికులు స్థానికంగా అందుబాటులో లేకపోవడం వల్ల ప్రాజెక్టుల నిర్మాణంలో జాప్యం పెరుగుతోందని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. విశాఖపట్నంలో నిర్మాణ రంగ వృద్ధి నిపుణ కార్మికుల కొరత వల్లే మందగిస్తోందని పరిశ్రమ వర్గాలు అంగీకరిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల జనాభాలో పని చేసే వయసులో (15-59 ఏళ్లు) ఉన్న వారి సంఖ్య 70శాతానికి పైనే ఉంది. ఇది జాతీయ సగటు 66శాతం కంటే ఎక్కువ. ఆ లెక్కన ఇక్కడ కార్మికులకు కొదవ ఉండకూడదు. కానీ, వాస్తవ పరిస్థితి వేరుగా ఉంది. చాలామంది స్థానిక కార్మికులు, ముఖ్యంగా యువత- నిర్మాణ రంగం, వ్యవసాయం వంటి శారీరక శ్రమతో కూడిన పనుల వైపు మొగ్గు చూపడంలేదు. వారు ఉబర్, స్విగ్గీ వంటి సంస్థల తరఫున గిగ్ వర్క్ చేయడానికే ఇష్టపడుతున్నారు. రిటైల్ రంగంలోనూ ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను ఎంచుకుంటున్నారు. లేదా ఇతర ప్రాంతాల్లో శారీరక శ్రమ లేని ఉద్యోగాలను వెతుక్కుంటున్నారు. మరికొందరు విదేశాలకు వలస వెళ్తున్నారు. విదేశాంగశాఖ గణాంకాల ప్రకారం 2021-2025 మధ్య ఏపీ నుంచే 76వేల మందికిపైగా కార్మికులు విదేశాల్లో.. ముఖ్యంగా గల్ఫ్ దేశాల్లో పనిచేయడానికి అనుమతి పొందారు. స్వదేశంలో కార్మికులకు గిరాకీ పెరుగుతున్న సమయంలోనే ఇలా వలసల వల్ల స్థానికంగా శ్రామికుల లభ్యత మరింత తగ్గిపోతోంది. వలస కార్మికులపై ఆధారపడటం కేవలం నిర్మాణ రంగానికే పరిమితం కాలేదు. వ్యవసాయ రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో విత్తనాలు విత్తడానికి, నాట్లు వేయడానికి, పంట కోతలకూ వలస కార్మికుల కోసం చూడాల్సి వస్తోంది. హోటళ్లు, రెస్టరెంట్లు, సెక్యూరిటీ సర్వీసులు, గోదాములు, ఇతర వ్యాపారాల్లో ఒడిశా, బెంగాల్ తదితర తూర్పు రాష్ట్రాల కార్మికులు పెద్ద సంఖ్యలో పనిచేస్తున్నారు. ఇది రాష్ట్రాల మధ్య సామాజికంగా, ఆర్థికంగా పెరుగుతున్న పరస్పరాశ్రిత సంబంధాన్ని తెలియజేస్తోంది. అయితే, భారతదేశంలో కార్మిక కొరత అనేది వృద్ధి, సమానత్వం, ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థలపై విస్తృత ప్రభావం చూపే అంశం. దీని ప్రతికూల ప్రభావాలు పలురకాలుగా ఉంటాయి. కార్మికుల కొరత వల్ల ప్రభుత్వ, ప్రైవేటు ప్రాజెక్టులు ఆలస్యమై వ్యయం పెరుగుతుంది. శిక్షణ పొందిన స్థానిక కార్మికులు తగినంత సంఖ్యలో లేకపోతే ఉత్పాదకత దెబ్బతింటుంది. అభివృద్ధి వేగం తగ్గుతుంది. వలస కార్మికులపై ఎక్కువగా ఆధారపడటం వల్ల వారి నివాసం, సంక్షేమం, సామాజిక సమగ్రత, కార్మిక హక్కుల వంటి సమస్యలు తలెత్తుతాయి. అదే సమయంలో పని అవసరమైన స్థానిక వర్గాలు ఉపాధి అవకాశాలను కోల్పోతాయి. ఈ అసమతుల్యతను సరిదిద్దాలంటే, అభివృద్ధి వ్యూహంలో కార్మిక ప్రణాళికనూ అంతర్భాగం చేయాలి. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా శిక్షణ కార్యక్రమాలు ఉండాలి. రహదారులు, స్మార్ట్ సిటీలు, సాగునీరు, గృహ నిర్మాణ ప్రాజెక్టులకు అవసరమైన శిక్షణను యువతకు అందించాలి. నిర్మాణ రంగం, వ్యవసాయం, అనుబంధ వృత్తుల పట్ల యువతరంలో ఆసక్తి పెంచడానికి మెరుగైన వేతనాలు, భద్రత, గౌరవప్రదమైన పని వాతావరణం, వృత్తిపరమైన ఎదుగుదలకు అవకాశాలు కల్పించాలి. శారీరక శ్రమను తగ్గించడానికి ఆధునిక నిర్మాణ పద్ధతులు, ప్రీకాస్ట్ టెక్నాలజీలు, యాంత్రీకరణలో పెట్టుబడులు పెట్టాలి. సంక్షేమ పథకాల ద్వారా వలస కార్మికులకు భరోసా కల్పించాలి. భారతదేశం మౌలిక సదుపాయాలను విస్తరించాలనే మహత్తర లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఇది అత్యవసరం కూడా. అయితే మౌలిక వసతులంటే కేవలం కాంక్రీటు, ఉక్కు మాత్రమే కాదు- అది మానవ మూలధనం కూడా. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లోని ప్రస్తుత పరిస్థితులు కార్మిక సరఫరా-గిరాకీ, ఆకాంక్ష-అవకాశం, శిక్షణ-ఉద్యోగాల మధ్య ఉన్న తీవ్రమైన వ్యత్యాసాన్ని పట్టి చూపుతున్నాయి. విధాన నిర్ణేతలు, పరిశ్రమలు, సమాజం కలిసి కార్మిక విధానాలు, నైపుణ్యాభివృద్ధి, వారి గౌరవం గురించి పునరాలోచించాలి. లేకుంటే కార్మిక కొరత వల్ల దేశాభివృద్ధి మందగించే ప్రమాదం ఉంది. జాతీయ మౌలిక సదుపాయాల నిర్మాణానికి ఇచ్చే ప్రాధాన్యాన్నే మానవ మూలధన అభివృద్ధికి కూడా ఇవ్వాలి.

# అధికార మదమే ఓటమికి కారణం.. మూడు రాష్ట్రాల ఓటర్లు ఇచ్చిన సందేశం



ప్రజాస్వామ్యంలో ఎన్నికల ఫలితాలు కేవలం పాలనను మార్చే ప్రక్రియ మాత్రమే కాదు. అవి ప్రజల ఆకాంక్షలకు, పాలనా లోపాలకు అద్దం పట్టే సూచికలు.. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో తమిళనాడు, పశ్చిమ బెంగాల్, కేరళ రాష్ట్రాల్లో పాలక ప్రభుత్వాలు ఓటమి చెందడం అనేది యాదృచ్ఛికం కాదు. ఇది నాయకత్వ అంచనా తప్పిదాల వల్ల, క్షేత్రస్థాయి వాస్తవాలను విస్మరించడం వల్ల సంభవించింది.

### యువతలో మార్పు- డీఎంకే పరాజయం

తమిళనాడులో దశాబ్దాలుగా ద్రవిడ రాజకీయాలను శాసించిన భాష, సాంస్కృతిక ఆధిపత్యం, సామాజిక న్యాయం వంటి భావోద్వేగ అంశాలు నేటి ఆధునిక యువతను ఆకట్టుకోలేక పోయాయి. కొత్త తరం ఓటర్లు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, పారదర్శక పాలనను కోరుకున్నారు. రాష్ట్ర జీడీపీ, పారిశ్రామిక పెట్టుబడులు కేవలం చెన్నై, కాంచీపురం, చెంగల్పట్టు ప్రాంతాలకే పరిమితం కావడం వల్ల దక్షిణ, మధ్య తమిళనాడు ప్రాంతాలు తీవ్ర పారిశ్రామిక వెనుకబాటుతనాన్ని ఎదుర్కొంటున్నాయి. దీనివల్ల ఏర్పడిన ప్రాంతీయ అసమానతలు, సంక్షేమ పథకాల కోసం ప్రభుత్వం చేస్తున్న భారీ అప్పుల భారం భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందనే ఆందోళన మధ్య తరగతి వర్గాల్లో బలంగా నాటుకుంది. మరోవైపు, సీట్ల పంపకాల విషయంలో మిత్రపక్షాలతో ఏర్పడిన అపశృతులు, అవినీతి ఆరోపణ లను పాలకులు తేలికగా తీసుకోవడం డీఎంకే కొంపముంచాయి. ప్రత్యేకించి మైనారిటీ ఓట్లు, కొత్త తరం నాయకత్వాలను ద్రవిడ పార్టీలు గుర్తించకపోవడం వల్ల ఓటు బ్యాంకులో చీలికలు వచ్చాయి. ఈ శూన్యాన్ని విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ కులాలకు అతీతంగా, యువత, మహిళలను ఆకర్షించడం ద్వారా భర్తీ చేసింది.

### పశ్చిమ బెంగాల్ మహిళా ఓటర్లలో తీవ్ర ఆగ్రహం

ఈ ఎన్నికల ఫలితాల్లో మమతా బెనర్జీ ఓటమి పాలవడానికి గల కారణాలను పరిశీలిస్తే ఆర్.జి. కర్ మెడికల్ కాలేజీ ఘటన, సందేశ్‌ఖాలీ ప్రాంతంలో మహిళలపై జరిగిన అఘాయిత్యాలను ప్రభుత్వం సమర్థవంతంగా పరిష్కరించలేకపోవడం వంటి అంశాలు మహిళా ఓటర్లలో తీవ్ర ఆగ్రహాన్ని, అభద్రతా భావాన్ని నింపాయి. ఈ సామాజిక అశాంతిని సువేందు అధికారి ఒక బలమైన ఉద్యమంగా మార్చి, మమతా బెనర్జీ పాలనను అరాచక పాలనగా ప్రజల్లోకి తీసుకెళ్లడంలో విజయం సాధించారు. మరోవైపు, ప్రభుత్వంలోని ఉన్నత స్థాయి నాయకులపై వస్తున్న అవినీతి ఆరోపణలు, నియామకాల్లో కుంభకోణాలు, ప్రతిపక్షాల గొంతు నొక్కేయాలనే రాజకీయ కక్షసాధింపు చర్యలు మధ్యతరగతి విద్యావంతులైన ఓటర్లను టీఎంసీకి దూరం చేశాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని యువత ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లాల్సి వస్తుండటం అధికార పార్టీకి నష్టం చేకూర్చింది.

### పారిశ్రామిక అభివృద్ధి లేదు..

కేరళ ఆర్థిక వ్యవస్థ నిర్మాణాత్మకంగా తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటోంది. రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి, అప్పుల నిష్పత్తి ప్రమాద కర స్థాయికి చేరడంతో, ప్రభుత్వం రోజువారీ నిర్వహణ, సంక్షేమ పథకాల కోసం భారీగా అప్పులు చేయాల్సి వచ్చింది. ఈ అప్పుల భారం భవిష్యత్తులో తమపై పన్నుల రూపంలో పడుతుందనే ఆందోళన మధ్యతరగతి, విద్యావంతుల్లో బలంగా నాటుకుంది. రాష్ట్రంలో నైపుణ్యం కలిగిన యువతకు తగిన ఉపాధి అవకాశాలు లభించడం లేదు. ప్రభుత్వ రంగంలో ఉద్యోగాల నియామకాల్లో అవకతవకలు జరిగాయనే ఆరోపణలు, కేరళలోని యువతను విదేశాలకు ముఖ్యంగా గల్ఫ్ దేశాలకు వలస వెళ్లేలా చేశాయి. పినరయి విజయన్ నాయకత్వ శైలి, నిర్ణయాలు ఒకే చోట కేంద్రీ కరించడం, మంత్రుల అహంకార వైఖరి పార్టీకి ప్రజలకు మధ్య అగాధాన్ని సృష్టించాయి.

### తెలియక చేసిన తప్పులు కావు..!

ఈ వైఫల్యాలు తెలియక చేసిన తప్పులు కావు. అవి పాలక పార్టీల అతి విశ్వాసం, అధికార మదం వల్ల జరిగినవి. తాము ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నా ప్రజలు తమ వెంటే ఉంటారనే నమ్మకం వారిని వాస్తవానికి దూరం చేసింది. పాలకులు తమ విధానాలను మార్చుకోకపోతే, ప్రజాస్వామ్య వ్యవస్థలో మార్పు తథ్యం అని ఈ ఫలితాలు నిరూపిస్తున్నాయి.

# ఓటర్ల తొలగింపే జాబితా ప్రక్షాళనా?



సర్ పేరుతో కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించే కార్యక్రమం దేశం నలుమూలలా సంచలనంగా మారిన విషయం తెలిసిందే; మరీ ముఖ్యంగా ఇతర దేశాలతో సరిహద్దు ఉన్న రాష్ట్రాల్లో ఈ కార్యక్రమం చేపట్టడం ఆందోళనలకు దారి తీస్తుంది. పైగా ఈ కార్యక్రమం ఎన్నికలకు కొన్ని నెలల ముందు చేపట్టటం సహజంగానే అనుమానాలకు తావిస్తుంది. అయితే కసరత్తు చెయ్యటం ఇదే మొదటిసారి కాదు. 1951 నుంచి 2004 వరకు ఇలాంటి కార్యక్రమం 8 సార్లు జరిగింది. 2004 తర్వాత మళ్లీ ఇప్పుడు అంటే 21 ఏండ్ల తర్వాత ఈసీ ఈ కార్యక్రమం చేపట్టింది. అయితే ఇంతకు మునుపు లేని గందరగోళం, దుమారం ఇప్పుడే ఎందుకు? అనేది ప్రశ్న. సర్ పేరుతో లక్షలాది మంది పేర్లను ఓటర్ల జాబితాలనుంచి తొలగిస్తున్నారని ఆరోపణ. ప్రజల్లో ఇది భయాందోళన కలిగిస్తుంది. ఓటు అనేది రాజ్యాంగం ప్రతి పౌరుడికీ కల్పించిన హక్కు. ఒకసారి ఓటర్ గా నమోదయితే జీవితకాలం వుండే హక్కుఅది. ఒక పేరును ఓటరు జాబితా నుంచి తొలగించటం అనేది కేవలం ఓటరు మరణించినప్పుడే చెయ్యాలి. వాస్తవానికి ఓటు అనేది సంక్షేమ పథకం కాదు. కాబట్టి సంక్షేమ పథకాల మాదిరిగా ఇప్పుడు అర్హులు భవిషత్తులో అనర్హులవటం, లేక ఇప్పుడు అనర్హులు భవిషత్తులో అర్హులవ్వటం జరగదు. సంక్షేమ పథకాలు ఆదాయంతో ముడిపడి ఉంటాయి. ఓటు ఆదాయంతో నిమిత్తం లేనిది. మరి ఏ కారణంతో జాబితాలో వున్న పేరును తొలగిస్తారు? ఒకే నిర్దిష్టమైన కారణం సదరు ఓటరు మరణించినప్పుడు. మరొక కారణం ఒక మనిషి పేరుమీద రెండు ఓట్లు ఉన్నప్పుడు. ఇవి సహేతుకమైన కారణాలు. వీటిమీద ఎవరికీ అభ్యంతరం వుండకూడదు. కానీ బెంగాల్‌లో, ఈ ప్రక్రియలో పాల్గొన్న ముస్లిం అధికారుల పేర్లు తొలగించారు. దీని మీద ఎన్ని విమర్శలు వచ్చినా ఎన్నికల సంఘం నుంచి సరైన సమాధానం లేదు. ఓటు లేని అర్హులందరినీ ఓటరు జాబితాలో చేర్చవలసిన ఎన్నికల సంఘం ఒక్క బెంగాల్ లో 90 లక్షల మందిని ఓటరు జాబితా నుంచి తొలగించింది. చట్టంలో లేని విధంగా, 'లాజికల్ డిస్క్రిపన్సీ' అనే సాకును నెపంగా చూపి 27 లక్షల మంది పేర్లను తొలగించింది. ఒక వ్యక్తికి ఒకటే ఆధార్ కార్డు, ఒకే పాన్‌కార్డు, ఒకే పాస్‌పోర్ట్ ఉంటుంది. వారి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వాడి, ఒక మనిషికి ఒకే ఓటు ఉండేలా చేయటం సాధ్యం కాదా అనేది ప్రశ్న. ప్రభుత్వ పింఛను పొందేవారు తాము జీవించి ఉన్నామని ఏడాదికి ఒకసారి నిరూపించుకోవాలి పింఛను ఇచ్చే సంస్థకి. దానినే లైఫ్ సర్టిఫికెట్ అంటారు. అరవై ఏండ్లు నిండిన ప్రతి ఓటరు ఐదేండ్లకొకసారి, తాము జీవించి ఉన్నామని నిరూపించుకునే ఆన్‌లైన్ వెసులుబాటు కల్పించలేమా? బ్యాంకు ఖాతా, పాన్‌కార్డులను ఆధార్‌తో అనుసంధానం చేసినట్టు, ఓటరు కార్డు కూడా ఆధార్‌తో అనుసంధానం చేయలేమా? ఎన్నికల్లో బయోమెట్రిక్ ఆధారంగా ఓటు వేసే విధానం తీసుకురాలేమా? అనేవి ఇక్కడ అందరిలోనూ తలెత్తే ప్రశ్నలు. ఓటరు జాబితా వెరిఫికేషన్ పేరుతో ఎన్నికల సంఘం ప్రజాస్వామ్య ప్రక్రియను పూర్తిగా నిర్వీర్యం చేసే పాపానికి ఒడిగట్టిందని మాజీ ఎన్నికల అధికారి అశోక్ లావాసా దుయ్యబట్టారు. కేంద్ర హోంమంత్రి కూడా ఓటరు జాబితాను పునీతం చేస్తామంటారు. ఇది హోంమంత్రి బాధ్యతా? ఎన్నికల సంఘం పనితీరు ప్రభుత్వానికి అతీతంగా ఉండాలి. కానీ కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం ఒకే భాష మాట్లాడటం విచిత్రం. రాష్ట్రాలు, రాజకీయ పార్టీల అభిప్రాయాలను ఎన్నికల సంఘం ఎందుకు పరిగణనలోకి తీసుకోవటం లేదు? ఈ ప్రక్షాళనలో భాగంగా మరణించిన వారి పేర్లను తొలగించటం మీద ఎవరికీ అభ్యంతరం ఉండదు. 21 ఏండ్ల సుదీర్ఘ వ్యవధిలో దేశంలో ఎన్నో కోట్ల మంది చనిపోయి ఉండవచ్చు. కానీ జీవించి ఉన్న లక్షలమంది ఓటర్లను జాబితాల నుంచి తొలగించారనేది విమర్శ. రెండు ఓట్లు కలిగి ఉన్న ఓటర్లు ఒక రాష్ట్రంలో లక్షల్లో ఉంటారా? ఇక ఓటు హక్కుకు అర్హులుగా నిరూపించుకోవటానికి పౌరసత్వం అనే విషయం కూడా తెరమీదకు వస్తుంది. కానీ ఎంతమంది భారతీయులు తాము ఈ దేశ పౌరులమని నిరూపించుకోగలరు? పౌరుడు అనేదానికి ఖచ్చితమైన రుజువు పాస్‌పోర్టు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంటుకు ఇచ్చిన సమాచారం ప్రకారం 2024 ఫిబ్రవరి రెండు నాటికి జారీ చేసిన పాస్‌పోర్టులు 9 కోట్ల 26 లక్షల 24 వేల ఆరువందల అరవైఆరు. గడచిన రెండేండ్లు కలుపుకొన్నా మొత్తం పాస్‌పోర్టులు 10 కోట్లకు మించి ఉండవు. మరి మిగిలిన వారందరూ ఈ దేశ పౌరులుగా నిరూపించుకోవటానికి నిర్దిష్టమైన ఆధారం ఏముంటుంది? అసలు ఓటును తొలగించటం అనే అంశం మీద సరైన ఏకాభిప్రాయం, అవగాహన ఇంకా రాలేదు దేశంలో. ముందు అవగాహన కలిగించి చేసి ఆ తర్వాత దీన్ని అమలు చేయడం శ్రేయస్కరం. ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగ వ్యవస్థలు ధర్మబద్ధంగా పనిచెయ్యటమే కాదు, పని చేస్తున్నట్లు కనిపించాలి కూడా. కానీ ప్రస్తుతం ఈ రెండు లక్షణాలు కనుమరుగవుతున్నాయి. భవిషత్తులోనైనా ఎస్ఐఆర్ కార్యక్రమం సక్రమంగా జరిగేటట్టు ఎన్నికల సంఘం తగిన చర్యలు తీసుకోవాలి, దాని గౌరవాన్ని కాపాడుకోవాలంటే దాని స్వతంత్ర ప్రతిపత్తిని కాపాడుకోవాలి

# ఇద్దరిని ట్రాక్టర్ తో తొక్కేసి పారిపోయాడు చివరకు పోలీసులకు చిక్కాడు



ప్రొద్దుటూరు : రూరల్ పరిధిలో జమ్మలమడుగు బైపాస్ రోడ్డు లోని శ్రీదేవి ఫంక్షన్ హాల్ వద్ద ముగ్గురు వ్యక్తులను టాక్టర్ ఢీకొంది. రూరల్ సీఐ నాగభూషణ్ వివరాల మేరకు దువ్వూరు మండలంలోని కృష్ణంపల్లి చెందిన నరసింహులు నంద్యాల జిల్లా చాగలమరికి చెందిన ఆకులమల్ల షరీఫ్ చిన్న వంగలికి చెందిన ఇమామ్ ఖాసింలు నిల్చుని ఉండగా నంగునూరు పల్లెకు చెందిన కోతుపోయిన సుమన్ అనే వ్యక్తి నిర్లక్ష్యంగా ట్రాక్టర్ నడుపుతూ ఈ ముగ్గురిని ఢీకొనడంతో నరసింహులు షరీఫ్ అక్కడికక్కడే మృతిచెందగా ఇమామ్ ఖాసిం తీవ్రంగా గాయపడ్డాడు. ట్రాక్టర్ తో ఢీ కొట్టిన డ్రైవర్ ట్రాక్టర్ తో సహా అక్కడ నుంచి పరారయ్యాడు. రూరల్ సీఐ ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి సాంకేతిక ఆధారాలతో గురువారం ట్రాక్టర్ డ్రైవర్ ను అరెస్టు చేసి ట్రాక్టర్ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. అరెస్టు చేసిన నిందితున్ని కోర్టులో హాజరుపరచగా 15 రోజులు రిమాండ్ కు పంపించినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసును త్వరగా చేదించిన ప్రొద్దుటూరు రూరల్ సీఐ నాగభూషణ్, ఎస్ఐలు శ్రీకాంత్, రాజు, మరియు సిబ్బందిని ప్రొద్దుటూరు ఏఎస్పి విభూకృష్ణ ప్రత్యేకంగా అభినందించారు.

# ఖైదీతో జైలు సూపరింటెండెంట్ ప్రేమ... చివరకు పెళ్లి!



మధ్యప్రదేశ్‌లో : ఓ అరుదైన ప్రేమకథ ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీ యాంశంగా మారింది. సత్నా జైలులో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఫిరోజా ఖాతూన్, అదే జైలులో 14 సంవత్సరాల శిక్ష అనుభవించిన మాజీ ఖైదీ ధర్మేంద్రతో ప్రేమలో పడి వివాహం చేసుకుంది. మతాలు, సామాజిక అడ్డంకులు, ఉద్యోగ పరమైన పరిమితులను కూడా లెక్కచేయకుండా ఇద్దరూ హిందూ సంప్రదాయంలో ఒక్కటయ్యారు. ధర్మేంద్ర హత్య కేసులో శిక్ష అనుభవిస్తూ సత్నా జైలులో ఉన్న సమయంలో ఫిరోజా ఖాతూన్ అక్కడ అధికారిణిగా విధులు నిర్వర్తించారు. ఖైదీల పట్ల క్రమశిక్షణతో పాటు మానవత్వంతో వ్యవహరించే ఫిరోజా, ధర్మేంద్ర ప్రవర్తనలో వచ్చిన మార్పును గమనించినట్లు తెలుస్తోంది. జైలులో ఉండగానే ధర్మేంద్ర చదువుపై ఆసక్తి పెంచుకుని, ఇతర ఖైదీలకు కూడా సహాయం చేస్తూ మంచి ప్రవర్తన కనబరిచాడని సమాచారం. కాలక్రమేణా ఇద్దరి మధ్య పరిచయం పెరిగి, అది పరస్పర గౌరవం నుంచి ప్రేమగా మారింది. ధర్మేంద్ర శిక్ష పూర్తయిన తర్వాత కూడా ఈ బంధం కొనసాగింది. కుటుంబ సభ్యులు, సమాజం నుంచి వ్యతిరేకత వచ్చినప్పటికీ ఇద్దరూ వెనక్కి తగ్గలేదు. చివరకు కుటుంబ సభ్యుల సమక్షంలో సాదాసీదాగా వివాహం చేసుకున్నారు. ఈ వివాహం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. "ప్రేమకు మతం లేదు", "మనసులు కలిస్తే అడ్డంకులు అర్థం లేవు" అంటూ చాలామంది నెటిజన్లు స్పందిస్తున్నారు. మరోవైపు, ప్రభుత్వ ఉద్యోగంలో ఉన్న అధికారి మాజీ ఖైదీని వివాహం చేసుకోవడం నైతికంగా సరైనదేనా? అనే చర్చ కూడా సాగుతోంది. అయితే ఫిరోజా ఖాతూన్ మాత్రం "వ్యక్తిలో మార్పు నిజమైన శిక్ష ఫలితం" అని తన సన్నిహితుల వద్ద చెప్పినట్లు ప్రచారం జరుగుతోంది. ధర్మేంద్ర కూడా తన జీవితాన్ని కొత్తగా ప్రారంభించాలనే ఉద్దేశంతో ఈ బంధాన్ని గౌరవంగా కొనసాగిస్తానని తెలిపినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ ప్రేమకథ దేశవ్యాప్తంగా ఆసక్తికర చర్చకు దారితీస్తోంది. జైలు గోడల మధ్య ప్రారంభమైన ఈ బంధం ఇప్పుడు వివాహ బంధంగా మారడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది.

# సొంత తమ్ముడిని పెళ్లి చేసుకున్న అక్క...



చిక్బలాపూర్ :రక్త సంబంధం మరచి అక్కాతమ్ముళ్లు పెళ్లి చేసుకున్న ఘటన కర్ణాటకలో కలకలం రేపింది. మూడేళ్లుగా ప్రేమించుకుంటున్న చిక్కబళ్లాపూర్ కు చెందిన శశికళ, ప్రవీణ్ తల్లులు సొంత అక్కాచెల్లెళ్లు. శశికళకు వేరొకరితో పెళ్లి నిశ్చయమవడంతో.. ప్రవీణ్ తో పరారై వివాహం చేసుకుంది. రక్షణ కోసం ఆ జంట పోలీసులను ఆశ్రయించింది. తల్లిదండ్రులు ఎంత చెప్పినా.. శశికళ మాత్రం భర్తతోనే ఉంటానని చెప్పింది..

# అట్టహాసంగా వైసిపి నాయకుడు అంజి నాయక్ జన్మదిన వేడుక








సోమందేపల్లి : పెనుకొండ నియోజకవర్గం లోని సోమందేపల్లి మండలం నాగినాయని చెరువు తాండ కు చెందిన అఖిలభారత బంజారా సేవ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ, నాగినాయిని చెరువు సర్పంచ్ ఆంజనేయులు నాయక్ జన్మదిన వేడుక ఘనంగా నిర్వహించిన సందర్భంగా హాజరైన, పాత్రికేయులు,వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, అఖిలభారత బంజారా సంఘం సేవా సమితి నాయకులు, న్యాయవాదులు, కుటుంబ సభ్యులు,పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఆ దేవదేవుని ఆశీస్సులతో మరెన్నో పుట్టినరోజులు జరుకోవాలని, వైసీపీ కార్యకర్తలు, నాగినినాయని చెరువు పంచాయతీ ప్రజల కోసం పనిచేస్తూ ఉన్నత పదవులను అధిరోహించాలని కోరారు.

# పుట్టినరోజు శుభాకాంక్షలు మిత్రమా...



సోమందేపల్లి :అఖిలభారత బంజారా సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు, వైసిపి రాష్ట్ర జనరల్ సెక్రెటరీ, నాగినాయని చెరువు సర్పంచ్ అంజి నాయక్ పుట్టినరోజు సందర్భంగా ఆయనకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నంద కుమార్ రెడ్డి, ఈ సందర్భంగా కేకు కట్ చేయించి అంజి నాయక్ కు నందకుమార్ రెడ్డి ప్రేమతో తినిపించారు...

# బీసీ సంక్షేమ శాఖకు రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంక్ రావడం హర్షణీయం



పెనుకొండ : పట్టణ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో రాష్ట్రంలో బీసీ సంక్షేమ శాఖ వార్షిక పనితీరులో ప్రథమ స్థానం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అలాగే ప్రజా ప్రభుత్వం ఏర్పడి 23 నెలల కాలంలో సాధించిన నూరు విజయాలు రాష్ట్ర అభివృద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించిన రాష్ట్ర స్థాయి శాఖల ర్యాంకింగ్ లో భాగంగా సంక్షేమం మరియు అభివృద్ధి సమన్వయంతో ముందుకు సాగుతున్న బీసీల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు గ్రామస్థాయి వరకు చేరుతున్నాయని కొనియాడారు. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత ఆధ్వర్యంలో బీసీ, ఈడబ్ల్యూఎస్, చేనేత వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు ఈ సందర్భంగా బిసి సంక్షేమ శాఖ కు రాష్ట్ర స్థాయి మొదటి ర్యాంకింగ్ రావడం జరిగిందని నాయకులు పేర్కొన్నారు.

### అదే విధంగా ఎన్డీయే

ప్రభుత్వం ఏర్పడి 23 నెలలు పూర్తి అయిన సందర్భంగా సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తున్న తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఎన్టీఆర్ భరోసా, స్త్రీ శక్తి, దీపం-2, ఉచిత ఇసుక విధానం, మెగా డీఎస్సీ, ఉద్యోగాల కల్పన, సోలార్ రూఫ్‌టాప్ పథకాలు, పేదలకు ఇళ్ల పంపిణీ వంటి కార్యక్రమాలు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నాయని పేర్కొన్నారు. బీసీ సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయడం వల్లే రాష్ట్ర స్థాయిలో ఈ గౌరవం దక్కిందని అభినందించారు. గ్రామ స్థాయి వరకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు చేరేలా కృషి చేస్తున్న ప్రతి ఉద్యోగికి ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగ అవకాశాలు, మౌలిక వసతుల అభివృద్ధిలో ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటోందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ కన్వీనర్ శ్రీరాములు యాదవ్,పెనుకొండ రూరల్ మండల కన్వీనర్ ఈశ్వర ప్రసాద్,రొద్దం మండల కన్వీనర్ నరహరి, కౌన్సిలర్లు గిరి, హనుమంతు,క్లస్టర్లు మొద్దిలేటి, సూరి,నాయకులు త్రివేంద్ర రఘువీరా,రామలింగ ,పులుగూర శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, చెంద్రాయుడు, బోయ నంజుండ ,బోయ సోము ,మల్లికార్జున , కృష్ణమూర్తి , అమాన్ , మాధవరెడ్డి , గోపాల్,వడ్డి అంజినేయులు, తెలుగుదేశంపార్టీ నాయకులు, కార్యకర్తలు, బిసి నాయకులు పాల్గొన్నారు.

# బీసీ బిడ్డల విద్యకు 'వసతి' దన్ను

పెనుకొండకు కొత్తగా 3 బీసీ హాస్టళ్లు మంజూరు

పరిగి, రొద్దం, సోమందేపల్లిలో ఏర్పాటు

రెండు బాలికల హాస్టళ్లు, ఒక బాలుర హాస్టల్

వచ్చే విద్యా సంవత్సరం నుంచి హాస్టళ్లు ప్రారంభం

విద్యార్థులను చేర్పించేలా బీసీ సంక్షేమశాఖాధికారులు కసరత్తు

హాస్టళ్ల మంజూరులో ఫలించిన మంత్రి సవిత కృషి

బీసీ బిడ్డలకు ఉన్నత విద్యే లక్ష్యం : మంత్రి సవిత



పెనుకొండ : బీసీల విద్యకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా ఎస్.సవిత నేతృత్వంలో బీసీ బిడ్డలకు విద్యతో పాటు ఆరోగ్య భద్రత, నాణ్యమైన ఆహారం అందిస్తోంది. ప్రభుత్వమందించిన ప్రోత్సాహంతో ఇటీవల విడుదలైన టెన్త్, ఇంటర్ ఫలితాల్లో బీసీ బిడ్డలు అత్యున్నతమైన ఫలితాలు సాధించడమే ఇందుకు నిదర్శనం. ఈ నేపథ్యంలో, పెనుకొండ నియోజక వర్గంలో వెనుకబడిన తరగతి విద్యార్థులందరికీ విద్య అందేలా కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నియోజక వర్గంలో కొత్తగా మూడు బీసీ హాస్టళ్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. పరిగి, రొద్దం, సోమందేపల్లిలో ఏర్పాటు చేయబోయే ఈ బీసీ హాస్టళ్లను వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించడానికి ఇప్పటికే చర్యలు చేపట్టింది. పరిగి, రొద్దంలో బాలికల హాస్టళ్లను, సోమందేపల్లిలో బాలుర హాస్టల్ ను ఏర్పాటు చేయనున్నారు. ఈ మూడు హాస్టళ్ల నిర్వహణకు హెచ్.డబ్ల్యూ.వో.లను(వార్డెన్లు) నియమించే పనిలో జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారులు తలమునకలయ్యారు. కొత్తగా ఏర్పాటు చేయబోయే హాస్టళ్లలో బీసీ విద్యార్థులు చేరేలా అధికారులు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం శ్రీ సత్యసాయి జిల్లాలో 61 బీసీ హాస్టళ్లు ఉన్నాయి. పెనుకొండ నియోజ వర్గంలో నాలుగు బీసీ హాస్టళ్లు ఉన్నాయి. వాటిలో రెండు పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లు కాగా, మరో రెండు ప్రీ మెట్రిక్ హాస్టళ్లు. ఇప్పుడు కొత్తగా ఏర్పాటు చేయబోయే మూడు హాస్టళ్లను కలిపి జిల్లాలో హాస్టళ్ల సంఖ్య 64కు చేరుకోనుంది.

### వార్డెన్ల నియామకానికి కసరత్తు

వచ్చే నెలలో నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానుండడంతో, కొత్తగా ఏర్పాటుచేయబోయే హాస్టళ్లలో హెచ్.డబ్ల్యూ.వో.లను(వార్డెన్లు) నియామకానికి జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారులు చర్యలు ప్రారంభించారు. తమ శాఖలో సిబ్బంది కొరత కారణంగా, ఇతర శాఖలకు చెందిన ఉద్యోగులను నియమించాలని ఆ శాఖ జిల్లా అధికారులు భావిస్తున్నారు. ఇందుకు సంబంధించి కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ కు ఓ లేఖను సైతం జిల్లా బీసీ సంక్షేమశాఖాధికారులు రాశారు. హెచ్.డబ్ల్యూ.వో.ల (వార్డెన్లు) నియామకంపై ఇతర శాఖల అధికారులకు లేఖ రాశారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలనకు, హెచ్.డబ్ల్యూ.వోల నియామకానికి ఓ కమిటీని ఏర్పాటు చేయబోతున్నారు. కొద్ది రోజుల్లోనే హెచ్.డబ్ల్యూ.వోల నియమించేలా బీసీ సంక్షేమశాఖాధికారులు చర్యలు ప్రారంభించారు.

### హాస్టళ్ల మంజూరులో ఫలించిన మంత్రి సవిత కృషి

నియోజక వర్గంలో బీసీ విద్యార్థులకు ఉన్నతవిద్య అందించాలన్న లక్ష్యంతో మంత్రి సవిత పనిచేస్తున్నారు. పేదలు, కూలీల పిల్లలు విద్యకు దూరం కాకూడదన్న ఉద్దేశంతో నియోజక వర్గంలో కొత్తగా మూడు బీసీ హాస్టళ్లు ఏర్పాటు చేసేలా మంత్రి సవిత కృషి చేశారు. సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి, పేదరికంతో బీసీ బిడ్డల డ్రాపౌట్లు పెరుగుతున్నాయని వివరించారు. ఉన్నత విద్య చదవాలని ఉన్నా పేదరికం కారణంగా మరికొందరు బడి బయటే ఉండిపోతున్నారని తెలిపారు. మంత్రి సవిత వినతిని మన్నించి, పెనుకొండ నియోజక వర్గంలో మూడు బీసీ హాస్టళ్ల ఏర్పాటుకు పచ్చజెండా ఊపారు. కొత్తగా ఏర్పాటు చేయబోయే పరిగి, రొద్దం, సోమందేపల్లిలో బీసీ హాస్టళ్లలో విద్యార్థులను చేర్పించడానికి బీసీ సంక్షేమ శాఖాధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు ప్రారంభించారు. ఆసక్తి కలిగిన విద్యార్థులను గుర్తించి, బీసీ హాస్టళ్లలో చేర్పించాలని జిల్లాలో మండల విద్యాశాఖాధికారులను, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులను కోరారు. పేద, వలస కూలీల పిల్లలతో పాటు హాస్టళ్లలో ఉంటూ చదువుకోవాలని ఆస్తకి చూపే బీసీ విద్యార్థులను ఈ మూడు హాస్టళ్లలో చేర్పించేలా కృషి చేస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి, తమ బిడ్డలను బీసీ హాస్టళ్లలో చేర్పించాలని కోరుతున్నారు.

### బీసీ బిడ్డలకు ఉన్నత విద్యే లక్ష్యం : మంత్రి సవిత

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీ బిడ్డలకు ఉన్నత విద్య అందించాలన్నదే సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత తెలిపారు. బీసీ హాస్టళ్లు, గురుకులాల అభివృద్ధికి గతంలో ఎన్నడూ లేనంతగా నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. సన్న బియ్యం భోజనంతో కూడిన మెనూ అమలు చేస్తూ, నాణ్యమైన ఆహారం అందిస్తున్నామన్నారు. పరిశుద్ధమైన తాగునీరు అందించడానికి ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేశామన్నారు. మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండేలా పారిశుధ్య సిబ్బందిని, రుచికరమైన భోజనం అందించడానికి కుక్ లు, కమాటీలను నియమించామన్నారు. తరగతి గదులు, విశ్రాంతి గదుల్లోకి దోమలు చొరబడకుండా ఉండేలా దోమ తెరలు ఏర్పాటు చేశామన్నారు. టెన్త్, ఇంటర్ లో మెరుగైన ఫలితాలు సాధించడానికి నిష్ణాతులైన ఉపాధ్యాయుల బోధనలతో పాటు మెటీరియల్ అందజేస్తున్నామన్నారు. హాస్టళ్లు, గురుకులాల ద్వారా బీసీ బిడ్డలకు ఆరోగ్య, ఆహార భద్రతతో కూడిన విద్య అందిస్తున్నామన్నారు. నియోజక వర్గంలో బీసీ బిడ్డలెవరూ బడి బయట ఉండకూడదనే లక్ష్యంతో, పరిగి, రొద్దం, సోమందేపల్లిలో బీసీ హాస్టళ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. బీసీ హాస్టళ్లలో చదివే విద్యార్థులకు తల్లికి వందనం, విద్యామిత్ర కిట్లు అందజేస్తామన్నారు. విద్యతోనే ఉన్నత స్థానాలకు చేరుకోవొచ్చని, బీసీ సామాజిక వర్గానికి చెందిన తల్లిదండ్రులు తమ బిడ్డను బడిలో చేర్పించాలని కోరారు. విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడుకుంటూ, వారికి విద్యతో పాటు ఆరోగ్య, రక్షణ భద్రత కల్పిస్తామని మంత్రి సవిత తెలిపారు.

# ప్రజా సమస్యలపై స్పందన వేగంగా ఉండాలి

పదే పదే కార్యాలయాల చుట్టూ తిప్పించుకోవద్దు

అధికారులకు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచన

క్యాంప్ కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమం


15 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు, కార్యకర్త కుటుంబానికి

రూ.5లక్షల ఇన్సూరెన్స్ అందజేసిన ఎమ్మెల్యే సునీత





అనంతపురం : ప్రజా సమస్యల పరిష్కారం విషయంలో అధికారుల స్పందన వేగంగా ఉండాలని ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. పలు సమస్యలపై కార్యాలయాలకు వచ్చే ప్రజలను పదేపదే తిప్పించుకోవద్దని ఆమె అన్నారు. అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు.



పలు ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చి తమ సమస్యలపై ఎమ్మెల్యే సునీతకు అర్జీలు ఇచ్చారు. వారి సమస్యలను ఓపికగా వింటూ కొన్నింటికి తక్షణమే పరిష్కారం చూపించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రధానంగా రెవెన్యూ, పంచాయతీ రాజ్, విద్యుత్, గ్రామీణ త్రాగునీటి సరఫరా, పింఛన్లు వంటి సమస్యల మీద అర్జీలు ఇచ్చారు. ఇందులో రెవెన్యూ, పంచాయతీ రాజ్ కు సంబంధించిన సమస్యల గురించి ఎమ్మెల్యే సునీత ప్రత్యేకంగా ప్రస్తావించారు. రెవెన్యూ సమస్యల విషయంలో అధికారులు వీలైనంత త్వరగా బాధితులకు న్యాయం చేసేలా చూడాలన్నారు. భూ సమస్యల విషయంలో గ్రామాల్లో ఉన్న పెద్దలు, నాయకులు చొరవ తీసుకొని సమస్యలు పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. మరోవైపు గ్రామాల్లో నెలకొన్న సమస్యల మీద స్థానికంగా ఉన్న అధికారులు స్పందించకపోవడం, నాంచడం వల్లే ఇంత దూరం వచ్చి అర్జీలు ఇస్తున్నారన్నారు. ఇకపై ప్రజా సమస్యల విషయంలో అధికారుల నిర్లక్ష్యం ఉంటే.. చర్యలు తప్పవన్నారు....

### 15 మందికి సీఎంఆర్ఎఫ్, కార్యకర్త కుటుంబానికి రూ.5లక్షల ఇన్సూరెన్స్ అందజేత

రాప్తాడు, అనంతపురం రూరల్ మండలాలకు చెందిన పలువురికి ఎమ్మెల్యే పరిటాల సునీత సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో మొత్తం 15 మంది లబ్ధిదారులకు రూ.6.24లక్షల రూపాయలు విలువైన చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల నాయకులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యే సునీత, ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. మరోవైపు టిడిపి మహిళా కార్యకర్త ఇటీవల మరణించగా ఆమె కుటుంబ సభ్యులకు పార్టీ నుంచి వచ్చిన రూ.5 లక్షల ఇన్సూరెన్స్ పత్రాన్ని ఎమ్మెల్యే సునీత అందజేశారు. కనగానపల్లి మండలం ముత్తవకుంట్ల గ్రామానికి చెందిన సావిత్రమ్మ ప్రమాదవశాత్తు మరణించారు. ఆమె తెలుగుదేశం పార్టీ కార్యకర్త కావడం, సభ్యత్వం ఉండటంతో ఎమ్మెల్యే సునీత చొరవతో ఆమెకు పార్టీ నుంచి ఐదు లక్షల ఇన్సూరెన్స్ వచ్చింది. మంత్రి నారా లోకేష్ నుంచి వచ్చిన ఇన్సూరెన్స్ పత్రాన్ని సావిత్రమ్మ కుమారుడు మణివర్ధన్ కి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ ఎప్పుడూ లేనివిధంగా నియోజకవర్గంలో రికార్డ్ స్థాయిలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అత్యవసర సమయాల్లో ఎన్టీఆర్ వైద్య సేవలు అందక ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్సలు పొంది ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారిని సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆదుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటికే నియోజకవర్గంలో ఎంతోమందికి సాయం అందించామన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజల ఆరోగ్యం విషయంలో ఆదుకునేందుకు ప్రభుత్వం ముందుంటుందన్నారు. పార్టీలో కార్యకర్తకు ఏ కష్టం వచ్చినా అండగా ఉండాలన్న ఉద్దేశంతో వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని తీసుకొచ్చారన్నారు. ప్రమాదవశాత్తు ఎవరైనా మరణిస్తే వారి కుటుంబానికి 5 లక్షల రూపాయలు సాయం అందుతోందన్నారు. దేశంలో ఏ పార్టీ కూడా కార్యకర్తల సంక్షేమం గురించి ఈ విధంగా ఆలోచించడం లేదన్నారు. నియోజకవర్గంలోని కార్యకర్తల తరపున అధినేత చంద్రబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు...

# తాగునీటి సమస్యలపై అమరావతిలో కలెక్టర్‌తో మంత్రి సత్యకుమార్ సమీక్ష

మంచినీటి సరఫరాపై కలెక్టర్‌కు కీలక సూచనలు చేసిన మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రజలకు మంచినీటి ఇబ్బందులు లేకుండా తక్షణ చర్యలు తీసుకోండి

ధర్మవరం ప్రజలకు శాశ్వత తాగునీటి పరిష్కారాలే లక్ష్యం

బడ్జెట్ సమస్యలు ఉంటే జనరల్ ఫండ్, డీఎంఎఫ్ నుంచి నిధులు విడుదల చేసి పనులు వేగవంతం చేయండి.

గ్రామీణ ప్రాంతాల్లో సాగునీటి, పశుగ్రాస సమస్యలపై దృష్టి సారించాలి

ప్రజల మౌలిక సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

మంత్రి సత్యకుమార్ యాదవ్





ధర్మవరం : ధర్మవరం నియోజకవర్గ ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా శాశ్వత పరిష్కారాలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖామంత్రి మరియు ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ గారు అమరావతిలో జరుగుతున్న కలెక్టర్ల సమావేశంలో సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ గారితో ప్రత్యేకంగా చర్చించారు. ఈ సందర్భంగా ధర్మవరం పట్టణంలోని పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న మంచినీటి సమస్యలను మంత్రి గారు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజలకు తాగునీటి ఇబ్బందులు ఎదురుకాకుండా తక్షణ చర్యలు చేపట్టాలని, ముఖ్యంగా నీటి సరఫరాలో అంతరాయం ఉన్న ప్రాంతాలకు వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ధర్మవరం పట్టణంలోని సమస్యాత్మక ప్రాంతాల్లో కొత్త పైప్‌లైన్లు, అదనపు కుళాయిల ఏర్పాటు, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా వంటి అత్యవసర చర్యలు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని మంత్రి స్పష్టం చేశారు. అవసరమైతే ప్రత్యేక బృందాలను నియమించి ప్రతి వార్డులో పరిస్థితిని సమీక్షించాలని సూచించారు. దీనిపై స్పందించిన సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ధర్మవరం పట్టణం మరియు మండలాల్లో తాగునీటి సమస్యలపై నిరంతరం సమీక్ష కొనసాగిస్తున్నామని తెలిపారు. సంబంధిత అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామని, ప్రజలకు తక్షణ ఉపశమనం కలిగే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అదేవిధంగా తాగునీటి సమస్యల పరిష్కారానికి నిధుల కొరత తలెత్తితే జనరల్ ఫండ్ లేదా జిల్లా ఖనిజ నిధి (ఐవీఖీ) ద్వారా అవసరమైన నిధులను విడుదల చేసి పనులు వేగవంతం చేయాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనలో ఎటువంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. ఇక గ్రామీణ ప్రాంతాల్లో కూడా సాగునీటి కొరత, పశుగ్రాస సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి కోరారు. రైతులు, పశుపోషకులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, చెరువులు, కుంటలు, కాలువల పరిస్థితిని సమీక్షిస్తూ అవసరమైన చోట తక్షణ పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ధర్మవరం నియోజకవర్గ ప్రజలకు అవసరమైన ప్రతి మౌలిక సదుపాయం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

# BSNL నుంచి న్యూ ఇయర్ గిఫ్ట్.. ఒక నెల ఫ్రీ ఇంటర్నెట్.. అతి చవక ధరకే కనెక్షన్




sబీఎస్ఎన్ఎల్ తమ కస్టమర్లకు న్యూ ఇయర్ ఆఫర్ తీసుకొచ్చింది. అతి తక్కువ ధరకే హై స్పీడ్ వైఫై ప్లాన్‌ను ప్రకటించింది. ఈ ప్లాన్‌తో అత్యంత చౌక ధరకే ఇంటర్నెట్ సౌకర్యం పొందవచ్చు. అలాగే అతి తక్కవ ధరలో టీవీ ఛానెల్స్ వీక్షించే ప్లాన్ కూడా తెచ్చింది. కేంద్ర ప్రభుత్వ టెలికాం రంగ సంస్థ అయిన బీఎస్ఎన్ఎల్ మొబైల్ నెట్‌వర్క్ సేవలే కాకుండా బ్రాడ్‌బ్యాండ్ సేవలు కూడా అందిస్తున్న విషయం తెలిసిందే. చౌకైన ధరలకే వైఫై ప్లాన్లను అందిస్తోంది. ప్రైవేట్ బ్రాడ్‌బ్యాంక్ ప్లాన్ల ధరలు అధికంగా ఉంటాయి. రూ.500 నుంచి వైఫై ప్లాన్లు ప్రారంభమవుతాయి. కానీ బీఎస్ఎన్ఎల్ తక్కువ ధరలో హైస్పీడ్ బ్రాడ్‌బ్యాంక్ కనెక్షన్లను అందిస్తోంది. దీంతో బీఎస్ఎన్ఎల్ వైఫై కనెక్షన్ తీసుకునేవారి సంఖ్య పెద్ద మొత్తంలో ఉంటుంది. ఎప్పటికప్పుడు బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్లపై ఆఫర్లు ప్రకటిస్తున్న బీఎస్ఎన్ఎల్.. న్యూఇయర్ సందర్భంగా బంపర్ ఆఫర్ ప్రకటించింది.

### రూ.399కే బేసిన్ ప్లాన్

బీఎస్ఎన్ఎల్ తాజాగా రూ.399కే బేసిక్ ఫైబర్ ప్లాన్ తీసుకొచ్చింది. ఈ ప్లాన్ తీసుకున్నవారికి తొలి నెల ఫ్రీగా సర్వీస్ లభిస్తుంది. ఇక తర్వాత మూడు నెలల పాటు వైఫై రీఛార్జ్‌పై రూ.100 డిస్కౌంట్ అందిస్తుంది. ఈ ప్లాన్‌లో 60 ఎంబీపీఎస్ వరకు ఇంటర్నెట్ స్పీడ్ లభించడంతో పాటు నెలకు 3300 బీజీ డేటా పొందవచ్చు. 18004444 నంబర్‌కు వాట్సప్ ద్వారా '%ఎఱ% అని మెస్సేజ్ పంపడం ద్వారా మీరు ఈ ప్లాన్ పొందవచ్చు. గతంలో ఈ ప్లాన్ ధర రూ.499 ఉండగా.. ఇప్పుడు న్యూ ఇయర్ ఆఫర్ కింద రూ.399కి తగ్గించారు. 3300జీబీ వరకు 60 ఎంబీపీఎస్ ఇంటర్నెట్ స్పీడ్ వస్తుంది. ఆ తర్వాత 4 ఎంబీపీఎస్ స్పీడ్ పొందవచ్చు.

### రూ.61 రీఛార్జ్‌తో వెయ్యి ఛానెల్స్

ఇక బీఎస్ఎన్ఎల్ ప్రీమియమ్ ప్యాక్ తీసుకొచ్చింది. దీని ద్వారా సెటాప్ బాక్స్ అవసరం లేకుండా టీవీ ఛానెల్స్ చూడవచ్చు. కేవలం రూ.61 రీఛార్జ్‌తో వెయ్యి ఛానెల్స్ చూడవచ్చు. అలాగే రూ.151తో లైట్ ప్లే హెచ్‌డీ ప్లాన్ అందుబాటులోకి తెచ్చింది. దీని ద్వారా మీరు హెచ్‌డీ ఛానెల్స్‌ను చూడవచ్చు. ఈ సర్వీస్ యాక్టివ్ చేసుకోవాలంటే 1800 444 నెంబర్‌కు వాట్సప్ ద్వారా మెస్సేజ్ చేయాలి.

# కేంద్రం కీలక నిర్ణయం.. మారనున్న ఇన్‌కమ్ ట్యాక్స్ రూల్స్.. అమల్లోకి కొత్త ఐటీ చట్టం




కొత్త ఐటీ చట్టాన్ని తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం ఎప్పటినుంచో ప్రయత్నాలు చేస్తోంది. 1961లో అప్పటివరకు ఉన్నవాటిల్లో మార్పులు చేసి కొత్త చట్టం అమల్లోకి తెచ్చారు. ఇప్పుడు వాటిల్లో కూడా మార్పు చేసి సరికొత్త చట్టం తీసుకురానున్నారు. వచ్చే ఏడాది నుంచి ఈ చట్టం అమలు చేయనున్నారు. ప్రస్తుతం పార్లమెంట్ శీతాకాల సమావేశాలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నెల 19వ తేదీ వరకు జరగనున్న సమావేశాల్లో పలు కీలక బిల్లులను కేంద్ర ప్రభుత్వం ఆమోదించనుంది. మహాత్మాగాంధీ గ్రామీణ జాతీయ ఉపాధి హామీ పథకం చట్టాన్ని రద్దు చేసి కొత్త చట్టాన్ని తీసుకొచ్చే కీలక బిల్లుతో పాటు మరికొన్ని బిల్లులను ప్రవేశపెట్టనుంది. ఈ క్రమంలో కొత్త ఆదాయపు పన్ను చట్టం ఎప్పటినుంచి అమలు చేస్తారనేది చర్చనీయాంశంగా మారింది. ఆదాయపు పన్ను చట్టం 2025 ఇప్పటికే పార్లమెంట్ ఆమోదం పొందగా.. కొత్త ఏడాది ఏప్రిల్ నుంచి అమల్లోకి రానుంది. ఈ చట్టంలో ఏవేం ప్రత్యేకలు ఉన్నాయో ఇప్పుడు తెలుసుకుందాం.


### సెక్షన్లు తగ్గింపు

గతంలో ఆదాయపు పన్ను చట్టంలో ఉన్న 47 చాప్టర్లను 23కి తగ్గించారు. అలాగే 819 సెక్షన్లను 536కి తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఇక షెడ్యూల్ సంఖ్య 16కి పరిమితం చేశారు. సెక్షన్ 10లో ఉన్న అన్ని మినహాయింపులను షెడ్యూల్స్‌లో చేర్చారు. వాడుకలో లేని పదాలను ఇప్పుడు తొలగించారు. ఇక ఇప్పటివరకు ఇన్‌కమ్ ట్యాక్స్ చెల్లించేటప్పుడు ఆర్థిక సంవత్సరం సెలక్ట్ చేసేటప్పుడు కన్‌ఫ్యూజన్ ఉండేది. అస్సెస్మెంట్ ఇయర్, ఫైనాన్సియల్ ఇయర్ వంటివి ఉండేవి. వీటి విషయాల్లో చాలా తికమక ఉండేది. కానీ ఇక నుంచి పన్ను సంవత్సరం అనేది పదం ఉపయోగించన్నారు. ఇక టీడీఎస్ అన్ని అంశాలను ఒకే సెక్షన్‌లో చేర్చారు. అలాగే ఇప్పటివరకు ఐటీ రైడ్స్ అంటే ఆఫీసులు, ఇళ్లు వాటిని ఎంచుకునేవారు. ఇకపై ఈమెయిల్స్, సోషల్ మీడియా అకౌంట్లు, క్లౌడ్ సర్వర్లు అనసీ చెక్ చేయనున్నారు.

### పాత పదజాలానికి ఎండ్ కార్డ్

ఇన్‌కమ్ ట్యాక్స్‌లో ఉపయోగించే పాత పదజాలానికి బదులు ఆధునిక పరిస్థితులకు అనుగుణంగా కొత్త పదజాలాన్ని అందుబాటులోకి తెచ్చారు. అలాగే క్రిప్టో, వర్చువల్, డిజిటల్ కరెన్సీకి కూడా హక్కులు వచ్చేలా కొత్త ఐటీ చట్టం రూపొందించారు. ఇక ఐటీ అధికారులకు రైడ్స్ విషయంలో విస్తృత అధికారులు కల్పించారు. ఫిబ్రవరిలో కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టనుంది. వచ్చే ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి ఐటీ చట్టాన్ని అమల్లోకి తీసుకురానున్నారు.

# యూపీఐ యాప్స్ వాడేవారికి హెచ్చరిక.. ఇలాంటివి జరిగితే డబ్బులు పంపించకండి..




ఇటీవల సైబర్ మోసాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. సైబర్ నేరగాళ్లు వినూత్న పద్ధతుల్లో జనాల్ని మోసం చేస్తున్నారు. యూపీఐ యాప్స్‌లో నకిలీ అకౌంట్లను సృష్టించి మోసం చేస్తున్నారు. దీంతో యూపీఐ యాప్స్‌లో ఎవరికైనా తెలియని వ్యక్తికి డబ్బులు పంపించేటప్పుడు జాగ్రత్తలు అవసరం. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఇప్పుడు చూద్దాం. ప్రస్తుతం డిజిటల్ యుగం నడుస్తోంది. అన్నీ సేవలు ఆన్‌లైన్‌లోనే అందుబాటులోకి వచ్చేశాయి. ఏ సర్వీస్ కావాలన్నా మొబైల్ ద్వారా ఇంటి నుంచే చేసుకునే వెసులుబాటు లభించింది. టెక్నాలజీని ఉపయోగించుకోవడంలో బ్యాంకింగ్ రంగం ముందు వరుసలో ఉంది. కస్టమర్లను ఆన్‌లైన్ ద్వారా అన్నీ సేవలు అందిస్తున్నాయి. అకౌంట్ ఓపెనింగ్ దగ్గర నుంచి నగదు లావాదేవీలు, క్రెడిట్ కార్డు, లోన్ సేవలు అన్నీ ఆన్‌లైన్ ద్వారానే అందిస్తున్నాయి. దీని వల్ల బ్యాంక్‌కు వెళ్లి క్యూలైన్‌లో నిల్చోవాల్సిన అవసరం తప్పింది. మొబైల్ నుంచి సులువుగా బ్యాంక్ సేవలన్నీ పొందుతున్నారు. ఇక యూపీఐ రాకతో డిజిటల్ ట్రాన్సాక్షన్లు మరింతగా పెరిగాయి. ఒక నిమిషంలోనే ఎవరికైనా నగదు పంపించుకోవడం లేదా స్వీకరించడం, బ్యాలెన్స్ చెక్ చేసుకోవడం లాంటి ఫీచర్లు ఉండటంతో యూపీఐ యాప్స్ వాడకం విపరీతంగా పెరిగిపోయింది. డిజిటల్ లావేదేవీలు పెరిగిన క్రమంలో సైబర్ నేరగాళ్లు తమ మోసాలకు దీనిని అడ్డాగా మార్చుకుంటున్నారు. ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతూ సులువుగా డబ్బులు కొట్టేస్తున్నారు. బ్యాంక్ ఓటీపీలు, కేవైసీ అప్డేట్, యూపీఐ యాప్స్ పేరుతో లక్షల సొమ్ము కొల్లగోడుతున్నారు. డిజిటల్ పేమెంట్ మోసాల బారిన పడి దేశంలో లక్షల మంది తమ సొమ్మును

# ఐసీఐసీఐ కస్టమర్లకు బిగ్ అలర్ట్.. జనవరి నుంచి కొత్త రూల్స్.. వాటిపై అదనంగా ఛార్జీలు..




ఐసీఐసీఐ క్రెడిట్ కార్డు వాడుతున్నారా..? అయితే మీకు అలర్ట్. జనవరి నుంచి ట్రాన్సాక్షన్లు, రివార్డ్ పాయింట్లు, సర్వీస్ ఛార్జీలపై పలు మార్పులు చోటుచేసుకోనున్నాయి. జనవరి 15 నుంచి ఈ కొత్త రూల్స్ అమల్లోకి రానున్నాయి. దీంతో క్రెడిట్ కార్డ్ వాడేవారు ముందే తెలుసుకోండి.. త్వరలో న్యూ ఇయర్ వస్తుండటంతో బ్యాంకులు తమ సర్వీసులకు సంబంధించి పలు మార్పులు చేస్తున్నాయి. బ్యాంకింగ్ సర్వీసులపై కొత్త ఏడాది నుంచి కొత్త రూల్స్‌ను అమలు చేసేందుకు రెడీ అవుతున్నాయి. క్రెడిట్ కార్డ్, ఆన్‌లైన్ ట్రాన్సాక్షన్లు, యూపీఐ ఛార్జీలకు సంబంధించి కొత్త మార్పులు తీసుకొచ్చేందుకు బ్యాంకులు రెడీ అవుతున్నాయి. ఈ క్రమంలో దేశంలోనే ప్రముఖ ప్రైవేట్ బ్యాంక్ అయిన ఐసీఐసీఐ బ్యాంక్ తమ కస్టమర్లకు కీలక ప్రకటన విడుదల చేసింది. ఐసీఐసీఐ కోరల్ రూపే క్రెడిట్ కార్డ్ ఉపయోగించేవారికి క్రెడిట్ కార్డు ఛార్జీలు, రివార్డ్ పాయింట్స్‌లో పలు మార్పులు చేసింది.

### కొత్త ఛార్జీలు

క్రెడిట్ కార్డు ఆన్‌లైన్ ట్రాన్సాక్షన్లపై విధించే ఛార్జీలలో మార్పులు చేసింది. డ్రీమ్11, రమ్మీ కల్చర్, జంగ్లీ, %వీూూ% వంటి ప్లాట్‌ఫామ్‌లలో నిర్వహించే లావాదేవీలపై 2 శాతం ఛార్జీ విధించనుంది. అలాగే అమెజాన్ పే,పేటీఎం, మోబిక్విక్, ఫ్రీఛార్జ్, ఓలా మనీ లాంటి థర్డ్ పార్టీ వాలెట్లలో క్రెడిట్ కార్డుల నుంచి డబ్బులు యాడ్ చేయాలంటే చార్జీలు విధించనుంది. రూ. 5 వేల కంటే ఎక్కువ నగదు ట్రాన్సక్షన్లపై 1 శాతం ఛార్జీ వసూలు చేయనుంది. ఇక ట్రాన్స్‌పోర్టేషన్ మర్చంట్ కేటగిరీ కోడ్ రూ.50 వేలు దాటిన ట్రాన్సాక్షన్లకు 1 శాతం ఛార్జీ విధించనుంది. వచ్చే ఏడాది జనవరి 15వ తేదీ నుంచి వీటిని అమల్లోకి తీసుకురానున్నట్లు ఐసీఐసీఐ బ్యాంక్ తెలిపింది.

### క్రెడిట్ కార్డు బిల్లు

ఇక క్రెడిట్ కార్డ్ బిల్లును బ్యాంక్‌కు వెళ్లి చెల్లించాలనుకుంటే.. ప్రతి చెల్లింపు లావాదేవీకి రూ.150 వసూలు చేస్తారు. ఇక విదేశాల్లో భారత కరెన్సీలో నిర్వహించే ప్రతి లావాదేవీకి లేదా దేశంలోనే విదేశీ దేశంలో నమోదు చేసుకున్న వ్యాపారులతో భారత కరెన్సీలో నిర్వహించే లావాదేవీలకు రుసుము వర్తిస్తుంది.

# మతిపోగొట్టే రాబడి ఇస్తున్న గోల్డ్ లు..! 2026లో మరింత పెరిగే అవకాశం ఉందా అంటే..?




బంగారం, వెండి ధరలు 2025లో భారీ రాబడిని అందించాయి, ముఖ్యంగా గోల్డ్ లు 72 శాతం పైగా లాభపడ్డాయి. స్టాక్, క్రిప్టో మార్కెట్లను మించిపోయాయి. ప్రపంచ వడ్డీ రేట్ల తగ్గింపులు, బలహీనమైన డాలర్, కేంద్ర బ్యాంకుల కొనుగోళ్లతో బంగారం 'సేఫ్ హెవెన్'గా మారింది. బంగారం, వెండి ధరలు ఈ ఏడాది ఎలా పెరిగాయో అందరికీ తెలిసిందే. బంగారంపై పెట్టుబడి పెట్టిన వారికి భారీ రాబడి అందించాయి. ఈ సంవత్సరం అత్యుత్తమ పనితీరు కనబరిచిన ఆస్తులుగా ఉద్భవించాయి. ఇవి స్టాక్, క్రిప్టో మార్కెట్ల నుండి వచ్చే రాబడిని మించిపోయాయి. 2025లో బంగారం పెరుగుదల పెట్టుబడిదారులను ఈ మార్కెట్ వైపు ఆకర్షించింది ఎక్స్ఛేంజ్-ట్రేడెడ్ ఫండ్స్‌వరుసగా ఏడవ నెలలోనూ పెట్టుబడులు పెరిగాయి. డేటా ప్రకారం.. నవంబర్‌లో బంగారు లపై పెట్టుబడిదారుల ఆసక్తి బలంగా ఉంది. రూ.3,741 కోట్ల నికర పెట్టుబడులు నమోదయ్యాయి. ఈ సంవత్సరం ఉత్తమ పనితీరు కనబరిచిన బంగారు లు 72 శాతం కంటే ఎక్కువ రాబడిని అందించాయి, పెట్టుబడిదారులకు వాటి ఆకర్షణను మరింత పెంచాయి. ఛాయిస్ వెల్త్ రిసెర్చ్ అండ్ ప్రొడక్షన్ విభాగాధిపతి అక్షత్ గార్గ్ మింట్ నివేదికలో మాట్లాడుతూ.. ర్యాలీ నిస్సందేహంగా బలంగా ఉందని, దీనికి మార్కెట్ వాతావరణం కొంతవరకు కారణమని అన్నారు. ప్రపంచ వడ్డీ రేటు తగ్గింపులను ఊహించి, సురక్షితమైన స్థలాలను వెతుక్కుంటూ పెట్టుబడిదారులు %జుఖీ%లలోకి డబ్బును కుమ్మరించారు. దీనితో బంగారం ధరలు సాధారణం కంటే పెరిగాయి. అయితే డిమాండ్ వాతావరణం, బలమైన మద్దతు అలాగే ఉందని గార్గ్ స్పష్టం చేశారు, ఎందుకంటే కేంద్ర బ్యాంకులు బంగారం కొనుగోలు చేస్తూనే ఉన్నాయి, డాలర్ బలహీనంగా ఉంది. బలహీనమైన డాలర్ ఇతర కరెన్సీలను కలిగి ఉన్నవారికి బంగారాన్ని చౌకగా చేస్తుంది. ఇంకా కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్లను తగ్గిస్తాయని భావిస్తున్నారు, దీనివల్ల వడ్డీ లేని బంగారాన్ని మరింత ఆకర్షణీయంగా మారుస్తుంది.

# వెండి ధర రూ.2.50 లక్షలకు చేరుతుందా..? ఆర్థిక నిపుణుల అంచనా ఎలా ఉందంటే?




గత కొన్ని నెలలుగా బంగారం, వెండి ధరలు గణనీయంగా పెరుగుతున్నాయి. ఈ ఏడాది వెండి ధర 120 శాతం పెరిగి, రూ.2 లక్షల మార్కును దాటి, 46 సంవత్సరాల రికార్డును బద్దలు కొట్టింది. సౌరశక్తి, ఇతర పారిశ్రామిక రంగాలలో డిమాండ్, పెట్టుబడిదారులు వెండిని సురక్షిత ఆస్తిగా చూడటం దీనికి కారణం. గత కొన్ని నెలలుగా బంగారం, వెండి ధరలు బాగా పెరుగుతున్నాయి. మధ్యలో కాస్త హెచ్చుతగ్గులకు కూడా గురయ్యాయి. ఈ సంవత్సరం వెండి ధర బంగారం కంటే ఎక్కువగా పెరిగింది. ఒక సంవత్సరంలో వెండి ధర దాదాపు 120 శాతం పెరిగింది. ఇప్పుడు ఇదే వెండి ధర వచ్చే ఏడాది రూ.2.5 లక్షలకు మించి ఉంటుందని భావిస్తున్నారు. డిసెంబర్ 12న దేశీయ మార్కెట్లో వెండి ధర కిలోకు రూ.2 లక్షలకు పైగా చేరుకుంది. వెండి ధర గత 46 సంవత్సరాల రికార్డును బద్దలు కొట్టింది. 1979 తర్వాత వెండి ధర ఇంత పెద్ద మొత్తంలో పెరగడం ఇదే మొదటిసారి. భవిష్యత్తులో కూడా వెండి ధర పెరుగుతూనే ఉంటుందని చెబుతున్నారు. విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, రాబోయే సంవత్సరంలో వెండి ధర రూ.2 లక్షల 40 వేల నుండి రూ.2 లక్షల 50 వేల వరకు పెరగవచ్చు. అంటే, ప్రస్తుత ధరతో పోలిస్తే వచ్చే ఏడాది వెండి ధర 25 శాతం పెరగవచ్చు. ఎప్రస్తుతం వివిధ రంగాలలో బంగారం డిమాండ్ పెరిగింది. పారిశ్రామిక ప్రపంచంలో ఈ లోహాన్ని పెద్ద మొత్తంలో ఉపయోగిస్తున్నారు. మరోవైపు ప్రజలు వెండిని కూడా పెట్టుబడిగా చూస్తున్నారు. సౌరశక్తి రంగంలో గత నాలుగు సంవత్సరాలలో బంగారం డిమాండ్ నాలుగు రెట్లు పెరిగింది. 2020లో సౌరశక్తి రంగంలో వెండి డిమాండ్ 94.4 మిలియన్ ఔన్సులు. ఇప్పుడు 2024లో, అదే డిమాండ్ 243.7 మిలియన్ ఔన్సులకు పెరిగింది. అందువల్ల, భవిష్యత్తులో బంగారం ధర రూ.2.5 లక్షల (కిలోకు) వరకు పెరిగే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు కూడా అంటున్నారు.

# కొత్త ఫోన్ కొనాలనుకుంటున్నారా? తక్కువ బడ్జెట్‌లో బెస్ట్ ఫీచర్లు కావాలంటే దీనిపై ఓ



లావా తన అగ్ని 4 5%స్మార్ట్‌ఫోన్‌ను ఇండియాలో రూ.24,999 ధరకు విడుదల చేసింది. ఇది 1.5%ఖ ూమీూజుణ 120 డిస్‌ప్లే, డైమెన్సిటీ 8350 చిప్‌సెట్, 50% కెమెరా, 5000% బ్యాటరీని కలిగి ఉంది.ఆధారిత ప్లాట్‌ఫారమ్‌తో క్లీన్ ఆండ్రాయిడ్ అనుభవాన్ని అందిస్తూ, బోల్డ్ సెకండరీ రియర్ డిస్‌ప్లేతో ప్రీమియం విభాగంలోకి అడుగుపెట్టింది. భారతీయ స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ లావా తన అగ్ని 4 లాంచ్‌తో ప్రీమియం లైనప్‌ను విస్తరించింది. ఇండియాలో దీని ధర రూ.24,999 గా ఉంది. బోల్డ్ సెకండరీ రియర్ డిస్‌ప్లేతో వస్తోంది. లావా అగ్ని 4ని దాని కొత్త ఎయిర్ ప్లాట్‌ఫామ్ కింద క్లీన్, నియర్-స్టాక్ ఆండ్రాయిడ్ ఎక్స్‌పీరియన్స్,-ఆధారిత ఫీచర్లతో వర్క్‌సెంట్రల్ స్మార్ట్‌ఫోన్‌గా నిలబెట్టింది అగ్ని 4 5+ 6.67-అంగుళాల 1.5%ఖ ూమీూజుణ% డిస్‌ప్లేను 120 రిఫ్రెష్ రేట్, 2,400 నిట్స్ వరకు పీక్ బ్రైట్‌నెస్, స్లిమ్ బెల్స్‌తో ఫ్లాట్ ప్యానెల్‌ను కలిగి ఉంది. ఈ డిస్ప్లే చాలా హుషారైనదిగా, స్పష్టంగా కనిపిస్తుంది. గేమింగ్, వీడియో స్ట్రీమింగ్/అతిగా చూడటానికి కచ్చితంగా అనుకూలంగా ఉంటుంది. ఇది మంచి ధ్వనిని అందించే, మల్టీమీడియా వినియోగాన్ని పెంచే డ్యూయల్ స్టీరియో స్పీకర్లతో కూడా వస్తుంది. లావా అగ్ని 4 ను మీడియాటెక్ డైమెన్సిటీ 8350 చిప్‌సెట్ శక్తివంతం చేస్తుంది, ఇది 4,300 లిక్విడ్ కూలింగ్ సిస్టమ్ ద్వారా సమర్థవంతమైన థర్మల్ మేనేజ్‌మెంట్ దీనికి ప్లస్‌పాయింట్. ఇది దాని విభాగంలో అత్యంత వేగవంతమైన స్మార్ట్‌ఫోన్‌లలో ఒకటి, ఇది సుదీర్ఘ గేమింగ్, రోజువారీ వినియోగం వంటి సామర్థ్యాలతో ఉంటుంది. 50% ప్రైమరీ కెమెరా, 8%ూ అల్ట్రా-వైడ్ కెమెరాతో డ్యూయల్ రియర్ కెమెరా సెటప్ ఉంది. ముందు భాగంలో 50% ఫ్రంట్ షూటర్‌ను కలిగి ఉంది. ఈ ఫోన్ 66% ఫాస్ట్ ఛార్జింగ్‌తో 5,000%పొూష్ట% బ్యాటరీని కలిగి ఉందిోగొట్టుకుంటున్నారు. దీంతో మోసాల గురించి మీకు ముందే అవగాహన ఉంటే క్రిమినల్స్ బారి నుంచి తప్పించుకోవచ్చు. మీరు డిజిటల్ ట్రాన్సాక్షన్లు నిర్వహించేటప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఇప్పుడు చూద్దాం. ఈ జాగ్రత్తలు పాటించండి డిజిటల్ పేమెంట్స్ చేసేటప్పుడు యాప్ నోటిఫికేషన్లను పరిశీలించండి

## వరల్డ్‌కప్‌లో 3 సెంచరీలు.. 22 సిక్సర్లతో 333 పరుగులు..

# ఇప్పుడు రోహిత్ వారుసుడిగా టీమిండియాలోకి రీఎంట్రీ

**టీమిండియా సారథ్య బాధ్యతల్లో బిసిసిఐ పెను మార్పులకు శ్రీకారం చుట్టబోతోంది. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో  ఒకే కెప్టెన్ ఉండాలని బోర్డు భావిస్తోంది. ఈ రేసులో శ్రేయస్ అయ్యర్ పేరు బలంగా వినిపిస్తోంది. ఐపీఎల్ 2026లో అతడు చూపిస్తున్న ప్రతిభకు బిసిసిఐ పెద్ద పీట వేయబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఆ వివరాలు మీకోసం..**



భారత క్రికెట్ నియంత్రణ మండలి  రాబోయే ఐసీసీ టోర్నీలను దృష్టిలో ఉంచుకుని కీలక నిర్ణయం తీసుకోబోతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం టీమిండియాలో ఒక్కో ఫార్మాట్‌కు ఒక్కో కెప్టెన్ ఉండటం వల్ల వ్యూహాల అమలులో ఇబ్బందులు ఎదురవుతున్నాయని బోర్డు భావిస్తోంది. అందుకే వైట్ బాల్ క్రికెట్ మొత్తానికి ఒకే కెప్టెన్ ఉండాలని బిసిసిఐ వర్గాలు నిర్ణయించినట్లు సమాచారం.  ఈ బాధ్యతలను స్వీకరించడానికి శ్రేయస్ అయ్యర్ అత్యంత అర్హుడని బోర్డు పెద్దలు భావిస్తున్నారు. ఐపీఎల్ 2026 సీజన్‌లో పంజాబ్ కింగ్స్ కెప్టెన్‌గా అతడు జట్టును నడిపిస్తున్న తీరు, సంక్లిష్ట పరిస్థితుల్లో తీసుకుంటున్న నిర్ణయాలు బిసిసిఐ సెలెక్టర్లను బాగా ఆకట్టుకున్నాయి. అలాగే గత కొంతకాలంగా గాయాల నుంచి కోలుకుని స్థిరమైన ప్రదర్శన చేస్తున్న అయ్యర్‌కు ఇది ఒక రివార్డ్ అని చెప్పవచ్చు. రోహిత్ శర్మ తర్వాత జట్టును సమర్థవంతంగా నడిపించగల నాయకత్వ లక్షణాలు అయ్యర్‌లో పుష్కలంగా ఉన్నాయని మాజీ క్రికెటర్లు సైతం అభిప్రాయపడుతున్నారు. ఒకే కెప్టెన్ ఉండటం వల్ల ఆటగాళ్ల ఎంపిక, జట్టు వ్యూహాల్లో స్పష్టత ఉంటుందని బిసిసిఐ యోచిస్తోంది. రాబోయే దక్షిణాఫ్రికా పర్యటన లేదా ఆ తర్వాత జరిగే సిరీస్‌ల నాటికి ఈ అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో టీమిండియా మరిన్ని విజయాలు సాధించాలని అభిమానులు ఆకాంక్షిస్తున్నారు.  అటు ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్ వరుసగా మూడో ఓటమిని చవి చూసింది. ఈ తరుణంలో అశ్విన్ కీలక కామెంట్స్ చేశాడు. పంజాబ్ కింగ్స్ తమ బ్యాటింగ్ ఆర్డర్‌తో ఇప్పుడే ప్రయోగాలు చేయవద్దని అశ్విన్ సూచించాడు. "ప్రియాన్ష్ ఆర్య షార్ట్ బంతులను ఎదుర్కోవడంలో తడబడుతున్నాడు, కానీ అంత మాత్రాన అతన్ని పక్కన పెట్టడం లేదా బ్యాటింగ్ ఆర్డర్ మార్చడం సరైన నిర్ణయం కాదు" అని అశ్విన్ తన యూట్యూబ్ ఛానెల్‌లో పేర్కొన్నారు. ప్రియాన్ష్ క్రీజులో మరీ నిశ్చలంగా ఉండటం వల్లే ప్యాట్ కమిన్స్ వంటి బౌలర్లు వేగం, బౌన్స్‌తో అతన్ని ఇబ్బంది పెడుతున్నారని చెప్పాడు.

## బౌలర్‌గా ధోనీ ఎంట్రీ? నెట్స్‌లో బౌలింగ్ చేస్తూ కనిపించిన 'తలా'.. వీడియో వైరల్

**ఈ సీజన్‌లో ఇప్పటివరకు జరిగిన 50కి పైగా మ్యాచ్‌ల్లో చెన్నై సూపర్ కింగ్స్  తరపున ధోనీ ఒక్కసారి కూడా తుది జట్టులో కనిపించలేదు. అయితే, తాజాగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఒక వీడియో అభిమానుల్లో కొత్త ఆశలు చిగురింపజేస్తోంది.**




ఐపీఎల్ 2026 సీజన్ క్లైమాక్స్ దశకు చేరుకుంటున్నా, కోట్లాది మంది అభిమానులు ఎదురుచూస్తున్న ఆ ఒక్క క్షణం ఇంకా రాలేదు. చెన్నై సూపర్ కింగ్స్  దిగ్గజం ఎంఎస్ ధోనీ ఈ సీజన్‌లో ఇప్పటి వరకు ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. అయితే తాజాగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఒక వీడియో నెట్టింట సంచలనం సృష్టిస్తోంది. ఎప్పుడూ బ్యాట్‌తో మెరుపులు మెరిపించే ధోనీ, ఈసారి బంతితో మైదానంలో కనిపిస్తుండటంతో "ధోనీ బ్యాటర్ లా కాదు.. బౌలర్‌గా వస్తున్నాడా?" అనే చర్చ మొదలైంది. చెన్నై సూపర్ కింగ్స్ తన తదుపరి మ్యాచ్‌లో మే 10న లక్నో సూపర్ జెయింట్స్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్‌కు ముందు నెట్స్‌లో ఎంఎస్ ధోనీ ప్రాక్టీస్ చేస్తున్న దృశ్యాలు బయటకు వచ్చాయి. సాధారణంగా బ్యాటింగ్ ప్రాక్టీస్ చేసే ధోనీ, ఈసారి చిన్న రన్-అప్‌తో స్పిన్ బౌలింగ్ చేస్తూ కనిపించారు. నవ్వుతూ సరదాగా బౌలింగ్ చేస్తున్న ధోనీ వీడియో చూసి ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. అయితే ఆయన కేవలం సరదాగా బౌలింగ్ చేశారా? లేక నిజంగానే బౌలర్‌గా బరిలోకి దిగుతారా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

ఈ సీజన్‌లో ధోనీ ఇప్పటి వరకు ఒక్క మ్యాచ్ కూడా ఆడకపోవడానికి ఫిట్‌నెస్ సమస్యలే ప్రధాన కారణమని తెలుస్తోంది. మోకాలి సమస్య కారణంగా ధోనీ వేగంగా పరుగెత్తలేకపోతున్నారని, అందుకే ఆయన తుది జట్టులో కనిపించడం లేదని రిపోర్ట్స్ చెబుతున్నాయి. గతంలో ఆయన బ్యాటింగ్, కీపింగ్ ప్రాక్టీస్ చేసినా, పూర్తి స్థాయిలో మ్యాచ్ ఆడేందుకు సిద్ధం కాలేదు. లక్నోతో మ్యాచ్ నాటికైనా ధోనీ మైదానంలోకి వస్తారని చెన్నై ఫ్యాన్స్ వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు.

సీఎస్కే ప్లేఆఫ్ అవకాశాలు

ఐపీఎల్ 2026లో ఇప్పటికే 50 మ్యాచ్‌లు ముగిశాయి. చెన్నై సూపర్ కింగ్స్ ప్రస్తుతం 10 మ్యాచ్‌లలో 5 విజయాలతో 10 పాయింట్లు సాధించి పట్టికలో ఆరో స్థానంలో ఉంది. ఈ సీజన్ ఆరంభంలో వరుసగా మూడు ఓటములను చవిచూసినా, ఆ తర్వాత పుంజుకుని అద్భుత ప్రదర్శన చేస్తోంది. ప్లేఆఫ్ రేసులో నిలవాలంటే చెన్నైకి మిగిలిన 4 మ్యాచ్‌లలో కనీసం 3 విజయాలు తప్పనిసరి. ఇలాంటి కీలక సమయంలో ధోనీ జట్టులోకి వస్తే అది సీఎస్కేకు కొండంత బలాన్ని ఇస్తుందనడంలో సందేహం లేదు.

బౌలింగ్ కోచ్ ఏమన్నారంటే?

ధోనీ రీఎంట్రీ గురించి చెన్నై బౌలింగ్ కోచ్ ఎరిక్ సిమన్స్ స్పందిస్తూ.. ధోనీ ఎప్పుడు వస్తారనే దానిపై స్పష్టమైన తేదీ లేదని వెల్లడించారు. ధోనీ ఫిట్‌నెస్‌ను ఎప్పటికప్పుడు గమనిస్తున్నామని, ఆయన ఎప్పుడు సిద్ధంగా ఉంటే అప్పుడు జట్టులోకి తీసుకుంటామని తెలిపారు. ఏదేమైనా ధోనీ నెట్స్‌లో బౌలింగ్ చేస్తూ కనిపించడం మాత్రం ఆయన ఫ్యాన్స్‌కు కొత్త ఉత్సాహాన్ని ఇస్తోంది. బహుశా ఇంపాక్ట్ ప్లేయర్‌గా అయినా ధోనీని ఈ సీజన్‌లో చూసే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.


## మిచెల్ మార్ష్ సెంచరీ విధ్వంసం.. ఆర్‌సీబీపై 9 పరుగుల తేడాతో లక్నో అద్భుత విజయం

**ముందుగా బ్యాటింగ్ చేసిన లక్నో జట్టులో ఓపెనర్ మిచెల్ మార్ష్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. ఆర్‌సీబీ బౌలర్లను ఉతికేస్తూ అద్భుతమైన సెంచరీతో జట్టు స్కోరును 209 పరుగులకు చేర్చాడు. అనంతరం ఛేజింగ్‌లో ఆర్‌సీబీకి లక్నో బౌలర్ ప్రిన్స్ యాదవ్ చుక్కలు చూపించాడు.**

ఐపీఎల్ 2026లో భాగంగా గురువారం రాత్రి జరిగిన ఉత్కంఠభరిత పోరులో లక్నో సూపర్ జెయింట్స్ ఎట్టకేలకు విజయం సాధించింది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు  జరిగిన ఈ మ్యాచ్‌లో లక్నో 9 పరుగుల తేడాతో గెలుపొందింది. వరుణుడు మాటిమాటికీ అడ్డుపడినా, ఇరు జట్లు పరుగుల సునామీ సృష్టించడంతో అభిమానులకు అసలు సిసలు మజా దక్కింది. లక్నో సూపర్ జెయింట్స్ జట్టుకు ఈ విజయం అత్యంత కీలకం. గత ఎనిమిది మ్యాచ్‌ల్లో వరుస ఓటములతో కుంగిపోయిన లక్నో, తమ సొంత గడ్డపై ఏకానా స్టేడియంలో ఎట్టకేలకు గెలుపు రుచి చూసింది. చివరిసారిగా ఏప్రిల్ 2025లో గుజరాత్ టైటాన్స్‌పై ఇక్కడ గెలిచిన లక్నో, అప్పటి నుంచి ఈ మైదానంలో ఓడిపోతూనే ఉంది. అయితే గురువారం జరిగిన మ్యాచ్‌లో ఆర్‌సీబీని ఓడించి తమ ఓటముల రికార్డుకు ఫుల్‌స్టాప్ పెట్టింది. ఈ గెలుపుతో లక్నో ప్లేఆఫ్ ఆశలను సజీవంగా ఉంచుకుంది. ముందుగా బ్యాటింగ్ చేసిన లక్నో జట్టులో ఓపెనర్ మిచెల్ మార్ష్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. ఆర్‌సీబీ బౌలర్లను ఉతికేస్తూ అద్భుతమైన సెంచరీతో జట్టు స్కోరును 209 పరుగులకు చేర్చాడు. అనంతరం ఛేజింగ్‌లో ఆర్‌సీబీకి లక్నో బౌలర్ ప్రిన్స్ యాదవ్ చుక్కలు చూపించాడు. ముఖ్యంగా విరాట్ కోహ్లీని సున్నా పరుగులకే క్లీన్ బౌల్డ్ చేసి మ్యాచ్‌ను లక్నో వైపు తిప్పేశాడు. కోహ్లీ అవుట్ అయిన తర్వాత ప్రిన్స్ చేసిన సెలబ్రేషన్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. 210 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఆర్‌సీబీకి టిమ్ డేవిడ్, క్రునాల్ పాండ్యా, రోమారియో షెపర్డ్ మెరుపులు మెరిపించి విజయం దిశగా నడిపించారు. ఒకానొక దశలో ఆర్‌సీబీ గెలిచేలా కనిపించింది. చివరి 6 బంతుల్లో బెంగళూరు విజయానికి 20 పరుగులు అవసరమయ్యాయి. అంతకుముందు తన 3 ఓవర్లలో 41 పరుగులు ఇచ్చిన దిగ్వేష్ రాఠీపై నమ్మకంతో కెప్టెన్ రిషబ్ పంత్ బంతిని అందించాడు. పంత్ నమ్మకాన్ని నిలబెడుతూ రాఠీ చివరి ఓవర్లో కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి కేవలం 10 పరుగులు మాత్రమే ఇచ్చి లక్నోకు విజయాన్ని అందించాడు.

# IPL జట్లకు బీసీసీఐ 8పేజీల స్ట్రిక్ట్ వార్నింగ్ లెటర్- అందులో ఏముందో తెలుసా?

**ఐపీఎల్ నిబంధనల ఉల్లంఘనపై సీరియస్ అయిన బీసీసీఐ- ప్లేయర్లకు హనీ ట్రాప్ ప్రమాదం పొంచి ఉందంటూ హెచ్చరిక- డ్రెస్సింగ్ రూమ్స్‌లో వేప్స్, ఈ సిగరెట్లపై కఠిన నిషేధం**



ప్రపంచంలోనే అత్యంత క్రేజ్ ఉన్న క్రికెట్ లీగ్ ఐపీఎల్‌లో ఇప్పుడు ఒక కొత్త చర్చ మొదలైంది. గ్రౌండ్‌లో ఆట కంటే కూడా ఆటగాళ్ల క్రమశిక్షణ పైనే ఇప్పుడు అందరి దృష్టి పడింది. ఐపీఎల్ 2026 సీజన్‌లో జరిగిన కొన్ని సంఘటనలు బీసీసీఐని ఆలోచనలో పడేశాయి. డ్రెస్సింగ్ రూమ్‌లో వేపింగ్ చేయడం నుంచి డగౌట్‌లో ఫోన్లు వాడటం వరకు రకరకాల ఉల్లంఘనలు వెలుగులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలోనే బోర్డు ఇప్పుడు చాలా కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించుకుంది. దీనికోసం అన్ని ఫ్రాంచైజీలకు ఒక సుదీర్ఘమైన హెచ్చరిక లెటర్ పంపింది. అసలు ఆ 8 పేజీల లేఖలో ఏముంది? ప్లేయర్లను హెచ్చరిస్తూ బోర్డు చేసిన ఆ సంచలన వ్యాఖ్యల వెనుక ఉన్న కారణాలేంటో ఇప్పుడు తెలుసుకుందాం.

హనీ ట్రాప్ డేంజర్- బీసీసీఐ సంచలన హెచ్చరిక

ఈ లేఖలో అన్నిటికంటే ముఖ్యమైంది హనీ ట్రాప్ వార్నింగ్. ఐపీఎల్ టోర్నీ జరుగుతున్నప్పుడు ప్లేయర్స్ టార్గెట్‌గా హనీ ట్రాప్స్ జరిగే అవకాశం ఉందని బీసీసీఐ వార్నింగ్ ఇచ్చింది. కొంతమంది ప్లేయర్స్ టీమ్ మేనేజర్లకు చెప్పకుండా హోటల్ రూమ్స్‌కు అనధికారిక వ్యక్తులను రానిస్తున్నట్లు బోర్డు దృష్టికి వచ్చింది. ఇది సెక్యూరిటీ పరంగా చాలా ప్రమాదకరమని, అందుకే ఇకపై ఎవరైనా గెస్ట్ రావాలి అంటే ఖచ్చితంగా గెస్ట్ అప్రూవల్ సిస్టమ్ ద్వారానే రావాలి అని బోర్డు రూల్ పెట్టింది. గెస్టుల వివరాలను ప్రతిరోజు రికార్డు చేయాలి అని టీమ్ మేనేజర్లకు ఆదేశాలు జారీ అయ్యాయి.

వేపింగ్ నిషేధం

రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్ డ్రెస్సింగ్ రూమ్‌లో వేపింగ్ చేస్తున్న వీడియో అప్పట్లో పెద్ద దుమారం రేపింది. ఈ విషయాన్ని బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా లేఖలో ప్రస్తావించారు. డ్రెస్సింగ్ రూమ్స్‌లో, డగౌట్స్‌లో లేదా టీమ్ హోటల్స్‌లో వేప్స్, ఈ సిగరెట్లు వాడటంపై పూర్తిస్థాయిలో నిషేధం విధించారు. భారత చట్టాల ప్రకారం కూడా ఇది నేరమని, ఎవరైనా నిబంధనలు మీరితే కఠిన చర్యలు తప్పవని బోర్డు హెచ్చరించింది. క్రమశిక్షణ అనేది టీమ్ గౌరవానికి సంబంధించిన విషయమని, దీనిని అశ్రద్ధ చేయకూడదని స్పష్టం చేసింది.

టీమ్ యజమానులకు కూడా కొత్త గైడ్ లైన్స్

కేవలం ఆటగాళ్లకు మాత్రమే కాదు, టీమ్ యజమానులకు కూడా బీసీసీఐ కొన్ని ఆదేశాలు ఇచ్చింది. మ్యాచ్ లైవ్‌లో జరుగుతున్నప్పుడు యజమానులు ప్లేయర్స్ దగ్గరకు వెళ్లడం, వారిని హగ్ చేసుకోవడం లేదా ఫిజికల్ గా ఇంటరాక్ట్ అవ్వడం వంటివి చేయకూడదు అని బోర్డు కోరింది. ఇలాంటి పనులు టీమ్ పరిస్థితులను దెబ్బతీస్తాయని సైకియా తన లేఖలో పేర్కొన్నారు. ప్లేయర్స్, మ్యాచ్ అఫీషియల్స్ ఉండే ఏరియా (గ్రామీణా) ప్రోటోకాల్స్ ను యజమానులు ఖచ్చితంగా పాటించాలి అని, ఆటగాళ్లకు డిస్టర్బెన్స్ కలిగించకూడదు అని లేఖలో వివరించారు.

అనధికారిక ప్రయాణాలపై నిఘా

చాలామంది ప్లేయర్స్, సపోర్ట్ స్టాఫ్ సెక్యూరిటీ ఆఫీసర్లకు చెప్పకుండా హోటల్ నుంచి బయటకు వెళ్తున్నట్లు బీసీసీఐ గమనించింది. ఇలా ఇష్టం వచ్చిన టైమ్‌లో హోటల్ దాటి బయటకు వెళ్లడంపై బోర్డు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇక నుంచి టీమ్ హోటల్ వదిలి వెళ్లే ప్రతిసారి మూవ్‌మెంట్ లాగ్‌లో ఎంట్రీ ఇవ్వాలి అని చెప్పింది. సెక్యూరిటీ లియాజన్ ఆఫీసర్ లేదా టీమ్ ఇంటిగ్రిటీ ఆఫీసర్ కు ఇన్ఫర్మేషన్ ఇవ్వకుండా ఎక్కడికి వెళ్లకూడదు అని రూల్ పెట్టింది. ఇది ప్లేయర్స్ సేఫ్టీకి చాలా ముఖ్యమని బోర్డు భావిస్తోంది.

టీమ్ మేనేజర్లదే బాధ్యత- 48 గంటల డెడ్ లైన్

ఈ కొత్త నిబంధనలను అమలు చేయడంలో టీమ్ మేనేజర్లదే కీలక పాత్ర అని బీసీసీఐ స్పష్టం చేసింది. ఈ అడ్వైజరీ అందిన 48 గంటల్లోపు ప్రతి టీమ్ మేనేజర్ తన ప్లేయర్లకు, సపోర్ట్ స్టాఫ్ కు ఈ విషయాలపై క్లారిటీ ఇవ్వాలి. ప్రతి ప్లేయర్ నుంచి ఈ రూల్స్ అర్థం అయ్యాయి అని రిటన్ లెటర్ తీసుకోవాలి అని బోర్డు కోరింది. అలాగే నిబంధనల అమలుపై బోర్డు ఎప్పుడైనా ఆడిట్ లేదా ఇన్‌స్పెక్షన్ చేసే అవకాశం ఉందని కూడా హెచ్చరించింది. ఎక్కడైనా లోపాలు కనిపిస్తే ఫ్రాంచైజీలపై కూడా చర్యలు తీసుకుంటాం అని తెలిపింది.

రూల్స్ బ్రేక్ చేస్తే భారీ మూల్యం తప్పదు

నిబంధనలు ఉల్లంఘిస్తే ఎలాంటి పర్యవసానాలు ఉంటాయో కూడా బీసీసీఐ ముందే క్లారిటీ ఇచ్చింది. ఎవరైనా రూల్స్ మీరితే నోటీసులు ఇవ్వడమే కాకుండా, భారీగా జరిమానాలు విధిస్తామని బోర్డు తెలిపింది. లీగ్ పేరు చెడగొట్టేలా ఎవరు ప్రవర్తించినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేసింది. ఐపీఎల్ పరువు కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని దేవజిత్ సైకియా తన లేఖలో గుర్తు చేశారు. నిబంధనల ప్రకారం కాకుండా అనధికారికంగా వ్యవహరిస్తే చట్టపరంగా కూడా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

# ఐపీఎల్ స్టార్లకు బీసీసీఐ వార్నింగ్.. రూల్స్ బ్రేక్ చేస్తే కెరీర్ రిస్క్‌లో పడటం ఖాయం

**ఐపీఎల్ 2026లో భద్రతా నియమాలు ఉల్లంఘిస్తున్న ఆటగాళ్లు, ఫ్రాంచైజీలపై బీసీసీఐ సీరియస్ అయింది. అనుమతి లేని వ్యక్తుల ప్రవేశంపై కఠిన చర్యలు తీసుకోనుంది. రియాన్ పరాగ్ వేపింగ్ చేస్తూ పట్టుబడడం, రాజస్థాన్ రాయల్స్ మొబైల్ వాడడం పై బీసీసీఐ వార్నింగ్ ఇచ్చింది.**



ఐపీఎల్ 2026 సీజన్ రసవత్తరంగా సాగుతున్న వేళ, ఆటగాళ్ల క్రమశిక్షణ, భద్రతా నియమాల విషయంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి (దీజజ×) అత్యంత కఠిన నిర్ణయాలు తీసుకుంటోంది. మైదానంలో ఆట కంటే బయట జరుగుతున్న కొన్ని పరిణామాలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. ఆటగాళ్లు, అధికారుల గదుల్లోకి అనుమతి లేని వ్యక్తులు ప్రవేశిస్తున్నారనే వార్తలపై బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా తీవ్రంగా స్పందించారు. ఈ మేరకు ఫ్రాంచైజీలకు, ఆటగాళ్లకు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు.

అసలేం జరిగింది? బీసీసీఐ సీరియస్ ఎందుకు?

ఐపీఎల్ జట్లతో సంబంధం లేని వ్యక్తులు టీమ్ బస్సుల్లో ప్రయాణించడం, ఆటగాళ్లు, అధికారుల గదుల్లోకి అక్రమంగా ప్రవేశించడం వంటి ఘటనలు బీసీసీఐ దృష్టికి వచ్చాయి. ఇది యాంటీ కరప్షన్ ప్రోటోకాల్స్ (అవినీతి నిరోధక నియమాలు)కు విరుద్ధమని సైకియా స్పష్టం చేశారు. ఆటగాళ్ల భద్రత, ఐపీఎల్ గౌరవాన్ని కాపాడటం తమ బాధ్యతని, ఇలాంటి అక్రమ ప్రవేశాలను ఏమాత్రం సహించబోమని ఆయన హెచ్చరించారు. ఈ మేరకు నేటి సాయంత్రం(మే 8 2026) ఒక కొత్త అడ్వైజరీ (మార్గదర్శకాలు) విడుదల చేయనున్నట్లు తెలిపారు.

రాజస్థాన్ రాయల్స్ చుట్టూ వివాదాలు

గత నెలలో రాజస్థాన్ రాయల్స్ జట్టుకు సంబంధించిన రెండు ప్రధాన ఘటనలు వెలుగులోకి వచ్చాయి. గౌహతిలో జరిగిన మ్యాచ్ సందర్భంగా టీమ్ మేనేజర్ రోమీ భిందర్ డగౌట్‌లో మొబైల్ ఫోన్ వాడుతూ దొరికిపోయారు. దీనికి గాను ఆయనకు రూ.1 లక్ష జరిమానా విధించి హెచ్చరించారు. ఆ తర్వాత కెప్టెన్ రియాన్ పరాగ్ డ్రెస్సింగ్ రూమ్‌లో వేపింగ్ చేస్తూ కనిపించారనే వార్తలు వైరల్ అయ్యాయి. ఇలాంటి ఘటనలు పబ్లిక్ డొమైన్‌లో ఉండటం బీసీసీఐ ప్రతిష్టను దెబ్బతీస్తోందని సైకియా ఆవేదన వ్యక్తం చేశారు.

డగౌట్ పవిత్రత, టీమ్ ఓనర్ల జోక్యం

మ్యాచులు జరుగుతున్నప్పుడు టీమ్ ఓనర్లు, ఉన్నతాధికారులు ఆటగాళ్లతో రిస్ట్రిక్టెడ్ ఏరియాల్లో కలవడంపై కూడా బీసీసీఐ అభ్యంతరం వ్యక్తం చేసింది. డగౌట్ అనేది ఆటగాళ్లు మరియు కోచింగ్ స్టాఫ్ కు మాత్రమే పరిమితం కావాలని, అక్కడ నిబంధనల అమలులో జాప్యం జరుగుతోందని సైకియా అభిప్రాయపడ్డారు. రూల్స్ ఎవరికైనా ఒకటేనని, ఓనర్లు అయినా, స్టార్ ప్లేయర్లు అయినా నియమాలను పాటించాల్సిందేనని ఆయన కరాఖండీగా చెప్పారు.

కఠిన చర్యలు తప్పవు

బీసీసీఐ కార్యదర్శి మాటలను బట్టి చూస్తే, ఐపీఎల్ లో ఇకపై ఉదారతకు తావు లేదని అర్థమవుతోంది. భవిష్యత్తులో ఏ చిన్న పొరపాటు జరిగినా కఠినమైన క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని, అవసరమైతే ఆటగాళ్లను సస్పెండ్ చేయడానికి కూడా వెనకాడబోమని హెచ్చరించారు. ఐపీఎల్ అనేది కేవలం వినోదం మాత్రమే కాదని, దీని వెనుక ఉన్న క్రమశిక్షణ, భద్రత అత్యంత ముఖ్యమని బోర్డు భావిస్తోంది.

# టీమిండియాలోకి వైభవ్ ఎంట్రీ ఖాయం.. కానీ అసలుసిసలు పరీక్ష అక్కడే



**వైభవ్ పెర్ఫార్మెన్స్ చూసి అతడిని వెంటనే టీమిండియా టీ20 జట్టులోకి తీసుకోవాలని ఫ్యాన్స్ కోరుతున్నారు. అయితే పుజారా మాత్రం వైభవ్ టెస్టు క్రికెట్ ఆడాలని కోరుకుంటున్నారు. ప్రస్తుతం ఈ ఐపీఎల్ సీజన్‌లో ఆ జట్టు తరపున అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు.**

భారత క్రికెట్‌లో ఇప్పుడు ఎక్కడ చూసినా, ఏ నోట విన్నా ఏళ్ల కుర్రాడు వైభవ్ సూర్యవంశీ పేరే వినిపిస్తోంది. ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడుతూ పరుగుల వరద పారిస్తున్న ఈ టీనేజ్ సెన్సేషన్ గురించి టీమిండియా వెటరన్ బ్యాటర్ ఛతేశ్వర్ పుజారా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వైభవ్ కేవలం టీ20లకే పరిమితం కాకుండా టెస్టు క్రికెట్ కూడా ఆడాలని, అప్పుడే ఒక ఆటగాడిగా పరిపూర్ణత వస్తుందని పుజారా అభిప్రాయపడ్డారు. కేవలం 15 ఏళ్ల వయసులోనే ఐపీఎల్ వంటి అతిపెద్ద లీగ్‌లో వైభవ్ సూర్యవంశీ అదరగొడుతున్నాడు. రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడుతున్న ఈ లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్.. ప్రస్తుత సీజన్‌లో ఆ జట్టు తరపున అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. ఇప్పటివరకు 10 ఇన్నింగ్స్‌ల్లో ఏకంగా 404 పరుగులు చేసి అందరి దృష్టిని ఆకర్షించాడు. తన విధ్వంసకర బ్యాటింగ్‌తో భవిష్యత్తు టీమ్ ఇండియా స్టార్‌గా అవతరించాడు. వైభవ్ పెర్ఫార్మెన్స్ చూసి అతడిని వెంటనే టీమిండియా టీ20 జట్టులోకి తీసుకోవాలని ఫ్యాన్స్ కోరుతున్నారు. అయితే పుజారా మాత్రం వైభవ్ టెస్టు క్రికెట్ ఆడాలని కోరుకుంటున్నారు. "వైభవ్ టీ20ల్లో అద్భుతంగా ఆడుతున్నాడు, అతడికి త్వరలోనే టీమిండియా పిలుపు వస్తుంది. కానీ టెస్టు క్రికెట్ అనేది ప్రతి యువ ఆటగాడి మనసులో ఉండాలి. ఒక ఆటగాడికి గౌరవం, పట్టుదల, టెక్నిక్ అనేవి టెస్టుల నుంచే వస్తాయి. సామర్థ్యం ఉంటే వైభవ్ కచ్చితంగా టెస్టుల్లో కూడా రాణించాలి" అని పుజారా పేర్కొన్నారు. టెస్టు క్రికెట్ గొప్పదే అయినప్పటికీ.. వైట్ బాల్ (పరిమిత ఓవర్ల) నిపుణులకు కూడా తమదైన ప్రాముఖ్యత ఉంటుందని పుజారా చెప్పారు. శ్రేయస్ అయ్యర్, వైభవ్ వంటి ఆటగాళ్లను వారి బలాబలాలకు అనుగుణంగా వాడుకోవాలని సూచించారు. వేర్వేరు ఫార్మాట్లకు వేర్వేరు ఆటగాళ్లను ఎంపిక చేసే విధానాన్ని ఆయన సమర్థించారు. దీనివల్ల ఆటగాళ్లపై ఒత్తిడి తగ్గడమే కాకుండా, ఆయా ఫార్మాట్లలో జట్టు మరింత బలంగా తయారవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.  జియోస్టార్ సిటివి హిందీ ఫీడ్ నిపుణుడిగా తన కొత్త పాత్ర గురించి కూడా పుజారా ముచ్చటించారు. టీవీలో మ్యాచ్ విశ్లేషణ చేయడం ద్వారా అభిమానులకు ఆటలోని లోటుపాట్లను వివరించవచ్చని ఆయన చెప్పారు. ఆటగాడిగా తనకున్న అనుభవం ద్వారా ఫీల్డ్‌లో జరిగే పరిస్థితులు, టెక్నిక్, బౌలింగ్ వ్యూహాలను విడమర్చి చెప్పడం వల్ల కుర్రాళ్లకు కూడా ఆటపై అవగాహన పెరుగుతుందని తెలిపారు. ఒక ఆటగాడు ఒక షాట్‌ను ఎలా ఆడాడు లేదా బౌలర్ ఏ యాంగిల్ వాడుతున్నాడు వంటి విషయాలు ప్రేక్షకులకు తెలియజేయడం తనకు సంతోషంగా ఉందన్నారు.

# ఫెమినా బ్యూటీ అవార్డ్స్‌లో రియా మెరుపులు.. డ్రెస్ అదిరిందిగా!



అందాల భామ రియా చక్రవర్తి గురించి ప్రత్యేకంగా పరిచయాలు అవసరం లేదు. కెరీర్ ఆరంభంలో విజేగా అలరించిన ఈ బ్యూటీ, ఆ తర్వాత వెండితెరపై తన మార్క్ చూపించింది. మధ్యలో కొన్ని వ్యక్తిగత ఒడిదుడుకులు ఎదురైనా, వాటన్నింటినీ దాటుకుని ఇప్పుడు మళ్ళీ గ్లామర్ ప్రపంచంలో ఫుల్ బిజీ అయిపోయింది. తాజాగా ఫెమినా బ్యూటీ అవార్డ్స్ కోసం రియా చేసుకున్న ఫోటోషూట్ ఇప్పుడు సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. ఆ మెస్మరైజింగ్ లుక్స్ మీకోసం.. జ్యూరీ డ్యూటీలో 'స్టైలిష్' ఎంట్రీ: రీసెంట్‌గా జరిగిన ఫెమినా బ్యూటీ అవార్డ్స్ వేడుకలో రియా చక్రవర్తి జ్యూరీ మెంబర్‌గా వ్యవహరించారు. ఈ విషయాన్ని ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ ద్వారా షేర్ చేస్తూ, "జ్యూరీ డ్యూటీని బాగా ఎంజాయ్ చేశాను" అంటూ పోస్ట్ పెట్టింది. అయితే ఆ పోస్ట్‌లో ఆమె ధరించిన డ్రెస్ చూసి నెటిజన్లు ఫిదా అయిపోతున్నారు. ఆమె గ్లామర్ చూస్తుంటే కళ్ళు తిప్పుకోవడం కష్టమే అనిపిస్తోంది. ఆ డ్రెస్ స్పెషాలిటీ ఏంటి?: ఈ ఈవెంట్ కోసం రియా 'ద లిటిల్ బ్లాక్ బౌ' అనే బ్రాండ్ నుండి వచ్చిన కస్టమ్ మేడ్ గౌనును ఎంచుకుంది. షాంపైన్ కలర్ టోన్‌లో ఉన్న ఈ డ్రెస్, ఆమె బాడీ లాంగ్వేజ్‌కు పర్ఫెక్ట్‌గా సెట్ అయ్యింది. ఒక వైపు షోల్డర్ డ్రాప్ అయి ఉండి, పొరలు పొరలుగా ఉన్న ప్లీటింగ్ డిజైన్ ఆమెకు ఒక వెస్ట్రన్ ప్రిన్సెస్ లుక్ ఇచ్చింది. మోడరన్ అండ్ క్లాసిక్ స్టైల్‌ను ఈ డ్రెస్ పక్కాగా బ్యాలెన్స్ చేసింది. ఆభరణాలతో మరింత మెరుపు: ఇక కేవలం డ్రెస్ మాత్రమే కాదు, ఆమె ధరించిన జ్యువెలరీ కూడా హైలెట్ అని చెప్పాలి. ఇక ఇంట్రికేట్ డిజైన్ నగలతో రియా మరింత కలర్‌ఫుల్‌గా కనిపించింది. ఈ ఫోటోలలో ఆమె స్కిన్ టోన్ మరియు ఆ డ్రెస్ కలర్ కాంబినేషన్ చాలా రిచ్‌గా కనిపిస్తోంది. అందుకే ఈ ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. 'తూనీగ తూనీగ' నుండి నేటి వరకు: రియా సినీ ప్రయాణం 2012లో తెలుగు సినిమా 'తూనీగ తూనీగ'తో మొదలైన సంగతి తెలిసిందే. ఆ తర్వాత బాలీవుడ్‌లో 'మేరె డాడ్ కి మారుతి' వంటి సినిమాలతో మెప్పించింది. మధ్యలో కొన్ని వివాదాలు ఆమె కెరీర్‌పై ప్రభావం చూపినా, వాటన్నింటినీ ధైర్యంగా ఎదుర్కొని మళ్ళీ స్ట్రాంగ్‌గా నిలబడింది. ఇక ఇప్పుడు తన కెరీర్‌పై పూర్తి ఫోకస్ పెట్టిన రియా, ఇలాంటి గ్లామరస్ ఫోటోషూట్స్‌తో ఫ్యాన్స్‌ను అలరిస్తూనే ఉంది. రియా చక్రవర్తి చేసిన ఈ లేటెస్ట్ ఫోటోషూట్ చూస్తుంటే, ఆమె తన సెకండ్ ఇన్నింగ్స్‌ను చాలా గ్రాండ్‌గా ప్లాన్ చేసుకున్నట్టు అర్థమవుతోంది. ద

డ్రెస్సింగ్ సెన్స్ దగ్గర నుండి కెమెరా ముందు ఇచ్చే పోజుల వరకు ప్రతిదీ పర్ఫెక్ట్‌గా ఉంది. మరి మీరు కూడా రియా అదరగొట్టిన ఈ ఫోటోలపై ఓ లుక్ వేయండి..





# సామ్ స్టన్నింగ్ లుక్.. మొదటి ఛాన్స్ గురించి చెబుతూ..

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత ఎప్పుడూ తన స్టైల్ తో అందరినీ ఆశ్చర్యపరుస్తూనే ఉంటుంది. కేవలం వెండితెరపైనే కాకుండా, ఫ్యాషన్ ప్రపంచంలో కూడా ఆమె తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపుని తెచ్చుకుంది. లేటెస్ట్ గా 'ద నోడ్' మ్యాగజైన్ కవర్ పేజీ కోసం సమంత చేసిన ఫోటోషూట్ ఇప్పుడు సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. ఇందులో ఆమె ధరించిన అవుట్‌ఫిట్, ఆమె మేకోవర్ చాలా డిఫరెంట్ గా ఉండటమే కాకుండా, సమంతలోని సరికొత్త ఎనర్జీని చూపిస్తోంది.

కేవలం గ్లామర్ మాత్రమే కాకుండా ఒక ప్రొఫెషనల్ మోడల్ తరహాలో ఆమె ఇచ్చిన పోజులు నెటిజన్లను ఆకట్టుకుంటున్నాయి. అయితే, ఈ ఫోటోషూట్‌తో పాటు తన కెరీర్ మొదలైన తొలినాళ్ల గురించి సమంత కొన్ని ఆసక్తికరమైన విషయాలను పంచుకుంది. చెన్నైలో ముగ్గురు పిల్లల్లో అందరికంటే చిన్నదైన సమంతకు అసలు నటనలోకి రావాలనే ఆలోచనే లేదట. కాలేజీ తర్వాత వచ్చిన ఒక చిన్న గ్యాప్‌లో సరదాగా మోడలింగ్ వైపు అడుగులు వేసి, అలా ఒక సినిమా ఆడిషన్‌కు వెళ్లి అనుకోకుండా హీరోయిన్ అయిపోయినట్లు ఆమె వెల్లడించింది. "ఒకవేళ ఛాన్స్ వస్తే ఒక ఏడాది పాటు సినిమాలు చేసి, మళ్ళీ చదువుకోవడానికి వెళ్లిపోవాలని అనుకున్నాను" అని సమంత చెప్పడం చూస్తుంటే, ఆమె జర్నీ ఎంత అన్ ఎక్స్పెక్టెడ్ గా సాగిందో అర్థమవుతోంది. ఈ ఫోటోషూట్‌లో సమంత ధరించిన వైట్ కలర్ డ్రెస్ ఆమె హెయిర్ స్టైల్ చాలా క్లాసీగా ఉన్నాయి. ఏ మాత్రం అతిగా అనిపించకుండా చాలా బ్యాలెన్స్‌డ్‌గా ఆమె ఈ లుక్‌ను క్యారీ చేసింది. ఫ్యాషన్ ప్రపంచంలో ఇలాంటి ప్రయోగాలు చేయడం సమంతకు కొత్తేమీ కాదు. గతంలో కూడా ఎన్నో నేషనల్ అండ్ ఇంటర్నేషనల్ బ్రాండ్లకు ఆమె అంబాసిడర్‌గా వ్యవహరించింది.

ఇక ఈ మ్యాగజైన్ షూట్‌లో ఆమె చూపుతున్న కాన్ఫిడెన్స్ చూస్తుంటే, నటిగా మాత్రమే కాకుండా ఒక ఎంటర్‌ప్రెన్యూర్‌గా కూడా ఆమె తనను తాను ఎంతగా మలుచుకుందో అర్థమవుతుంది. తన టీచర్లు తాను నటిని అవ్వడం చూసి అప్పట్లో కొంత నిరాశ చెందారని, బహుశా ఇప్పటికీ వారు అలాగే అనుకుంటుండవచ్చని సమంత నవ్వుతూ చెప్పుకొచ్చింది. అయితే తన జీవితంలో ఎదురైన ఒడిదుడుకులను ఎదుర్కోవడంలో ఈ ప్రొఫెషన్ తనకు ఎంతో ధైర్యాన్ని ఇచ్చిందని ఆమె అభిప్రాయపడింది.

కేవలం సినిమాలకే పరిమితం కాకుండా బ్యూటీ, వెల్‌నెస్, ఫ్యాషన్ స్పోర్ట్స్ వంటి రంగాల్లో కూడా ఆమె తన మార్క్ చూపిస్తోంది. ఈ డిఫరెంట్ ప్రయాణమే తనను నిరంతరం ఉత్సాహంగా ఉంచుతుందని ఆమె వెల్లడించింది. ఇక సమంత లేటెస్ట్ ఫోటోషూట్ ఆమె అభిమానులకు ఒక విజువల్ ట్రీట్ అని చెప్పాలి. సినిమాల్లో పవర్ ఫుల్ పాత్రలు చేస్తూనే, ఇలాంటి గ్లామరస్ షూట్స్ తో కూడా ఆమె తన క్రేజ్ ఏంటో నిరూపించుకుంటోంది. ప్రస్తుతం ఆమె నటిస్తున్న 'మా ఇంటి బంగారం' సినిమా మరికొన్ని రోజుల్లో రిలీజ్ కానుంది.




# బ్లాక్ అవుట్ ఫిట్ లో స్టార్ హీరో భార్య అందాలు..

టాలీవుడ్ భల్లాళదేవుడు రానా దగ్గుబాటి భార్యగా కంటే, తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారు మిహీకా బజాజ్. సాధారణంగా స్టార్ హీరోల భార్యలు వెలుగులోకి రావడానికి అంతగా ఇష్టపడరు, కానీ మిహీకా మాత్రం తన అద్భుతమైన ఫ్యాషన్ సెన్స్‌తో ఎప్పుడూ వార్తల్లో నిలుస్తుంటారు. తాజాగా ఆమె ధరించిన ఒక బ్లాక్ అవుట్‌ఫిట్ సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. తన గ్రేస్ మరియు స్టైల్‌తో మిహీకా నెటిజన్ల మనసు దోచుకుంటోంది. ఆ విశేషాలు చూద్దాం .. బ్లాక్ డ్రెస్‌లో మెరిసిపోతున్న సుందరి: రీసెంట్‌గా ఒక ఈవెంట్‌లో పాల్గొన్న మిహీకా, ఫ్లోర్-లెంగ్త్ బ్లాక్ హాల్టర్-నెక్ గౌనులో మెరిసిపోయారు. ఈ డ్రెస్‌లో ఆమె చూస్తుంటే ఒక ప్రొఫెషనల్ మోడల్‌లా కనిపిస్తున్నారంటూ నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. ఇక 2020న రానాను పెళ్లాడినప్పటి నుండి మిహీకా తన వ్యక్తిత్వాన్ని మరియు స్టైల్‌ను చాలా హుందాగా కాపాడుకుంటూ వస్తున్నారు. ఈ లేటెస్ట్ లుక్ ఆమె అందాన్ని మరింత రెట్టింపు చేసింది." అబ్బురపరిచే డిజైన్ మరియు స్టైల్: మిహీకా ధరించిన ఈ గౌను చాలా ప్రత్యేకంగా డిజైన్ చేయబడింది. డీప్ హార్ట్-షేప్ నెక్‌లైన్ మరియు హాల్టర్-నెక్ డిజైన్ ఆమె భుజాలను, రూపాన్ని హైలైట్ చేశాయి. ముఖ్యంగా నడుము భాగంలో ఉన్న రుచింగ్ స్టైల్ ఆ డ్రెస్‌కు ఒక క్లాసిక్ లుక్ ఇచ్చింది. తన స్లెండర్ ఫిగర్‌కు సరిగ్గా సరిపోయేలా ఈ అవుట్‌ఫిట్ ఉండటంతో, ఫ్యాషన్ ప్రియులు ఈ డిజైన్ గురించి తెగ ఆరా తీస్తున్నారు. థై-హై స్లిట్‌తో బోల్డ్ లుక్: ఈ డ్రెస్‌లో అందరినీ ఆకర్షించిన మరో ముఖ్యమైన అంశం 'థై-హై స్లిట్'. అంటే కాలు వరకు ఉండే పొడవైన డ్రెస్ మరియు అక్కడి నుండి కిందకు జాలువారుతున్న రఫ్ఫుల్స్ ఈ గౌనుకు ఒక డ్రామాటిక్ ఎఫెక్ట్‌ను ఇచ్చాయి. మోడ్రన్ టచ్‌తో పాటు ఎంతో ఎలిగెంట్‌గా కనిపిస్తున్న ఈ అవుట్‌ఫిట్‌లో మిహీకా కెమెరాలకు ఫోజులిచ్చిన తీరు సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. ఫ్యాషన్ ఐకాన్‌గా మిహీకా: మిహీకా కేవలం రానా భార్యగానే కాకుండా, ఇంటీరియర్ డిజైనింగ్ మరియు ఈవెంట్ ప్లానింగ్ రంగంలో కూడా రాణిస్తున్నారు. అందుకే ఆమె ఫ్యాషన్ ఎంపికలు ఎప్పుడూ చాలా వెరైటీగా, కొత్తగా ఉంటాయి. గతంలో చీరకట్టులో ఎంతో సాంప్రదాయంగా కనిపించిన ఆమె, ఇప్పుడు వెస్ట్రన్ అవుట్‌ఫిట్‌లో కూడా అదే స్థాయిలో రాణిస్తూ అందరినీ ఆశ్చర్యపరుస్తున్నారు. మొత్తానికి బ్లాక్ అవుట్‌ఫిట్‌లో మిహీకా దగ్గుబాటి ఇచ్చిన ఈ అదిరిపోయే లుక్ ఇప్పుడు నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. తనకంటూ ఒక యూనిక్ స్టైల్‌ను క్రియేట్ చేసుకుంటూ, గ్లామర్ మరియు హుందాతనాన్ని బ్యాలెన్స్ చేయడంలో ఆమె సక్సెస్ అయ్యారు. ఇక దగ్గుబాటి ఫ్యాన్స్ కూడా తమ వదినమ్మ స్టైలిష్ లుక్ చూసి తెగ మురిసిపోతున్నారు.



# ఓవర్సీస్ లో 'పెద్ది' సంచలనం..
# ఫస్ట్ మూవీగా రికార్డ్..




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా దర్శకుడు బుచ్చిబాబు సనా తెరకెక్కిస్తున్న భారీ చిత్రం పెద్ది విడుదలకు ముందే ఓవర్సీస్ మార్కెట్ లో సంచలనం సృష్టిస్తోంది. ముఖ్యంగా అమెరికా ప్రీమియర్ బుకింగ్స్ లో ఆ సినిమా చూపిస్తున్న జోరు ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. విడుదలకు ఇంకా కొన్ని వారాలు ఉండగానే అడ్వాన్స్ బుకింగ్స్ ఓపెన్ చేయగా, అతి తక్కువ సమయంలో భారీ స్థాయిలో టికెట్లు అమ్ముడవడం విశేషం. అమెరికాలో జూన్ 3న గ్రాండ్ ప్రీమియర్స్ కు ప్లాన్ చేసిన ఆ చిత్రానికి సంబంధించిన బుకింగ్స్ ప్రారంభమైన కేవలం 30 నిమిషాల్లో 50 వేల డాలర్లకు పైగా ప్రీ సేల్స్ నమోదయ్యాయి. నాలుగు గంటలు పూర్తయ్యేలోపే లక్ష డాలర్ల మార్క్ ను అందుకోవడం విశేషం. అత్యంత వేగంగా లక్ష టికెట్స్ సేల్ అయిన చిత్రంగా కూడా రికార్డు క్రియేట్ చేసింది పెద్ది చిత్రం. అయితే టాలీవుడ్ లో ఇటీవల విడుదలైన పలు భారీ చిత్రాల రికార్డులను బ్రేక్ చేస్తూ ఆ ఫీట్లు సాధించింది. ముఖ్యంగా పవన్ కళ్యాణ్ ఓజీ, తారక్ దేవర, ప్రభాస్ సలార్ వంటి సినిమాల ప్రారంభ బుకింగ్స్ రికార్డులు పెద్ది బ్రేక్ చేసింది. ఓవర్సీస్ లో ఆ చిత్రాన్ని భారీ స్థాయిలో విడుదల చేయడానికి డిస్ట్రిబ్యూటర్లు కూడా స్పెషల్ ప్లాన్ ను సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక నార్త్ అమెరికాలో 950కి పైగా షోలతో విడుదలకు ఏర్పాట్లు జరుగుతున్నాయని సమాచారం. బుకింగ్స్ ఓపెన్ అయిన వెంటనే అనేక ప్రాంతాల్లో సీట్లు స్పీడ్ గా ఫుల్ అవుతుండటంతో సినిమాపై అభిమానుల్లో ఆసక్తి ఏ రేంజ్ లో ఉందో క్లియర్ గా అర్థమవుతోంది. ముఖ్యంగా అమెరికాలో తెలుగు ప్రేక్షకులు చరణ్ మూవీపై భారీ అంచనాలు పెట్టుకున్నట్లు కనిపిస్తోంది. ఇటీవల విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ కూడా సినిమాకు మంచి బజ్ తీసుకొచ్చింది. ముఖ్యంగా రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన గ్లింప్స్ సోషల్ మీడియాలో భారీ రెస్పాన్స్ తెచ్చుకుంది. చరణ్ లుక్, మాస్ బాడీ లాంగ్వేజ్, విలేజ్ బ్యాక్ డ్రాప్ లో కనిపించిన యాక్షన్ ఎలిమెంట్స్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. చిత్రంలో ఎమోషన్స్ స్ట్రాంగ్ గా ఉండబోతున్నాయని, కొంతమంది రంగస్థలం తరహా ఎమోషనల్ కనెక్ట్ కనిపిస్తుందని అంచనా వేస్తున్నారు. పెద్ది చిత్రాన్ని స్పోర్ట్స్, యాక్షన్, ఎమోషన్ ఎంటర్టైనర్ గా దర్శకుడు బుచ్చిబాబు రూపొందిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఆయన తెరకెక్కించిన ఉప్పెనలో ఎమోషన్స్ కు స్పెషల్ ఇంపార్టెన్స్ ఉండటంతో పెద్ది సినిమాపై కూడా అదే రేంజ్ లో అంచనాలు పెరిగాయి. బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటిస్తుండగా, కన్నడ స్టార్ శివరాజ్ కుమార్ కీలక పాత్ర పోషిస్తున్నారు. భారీ ప్రొడక్షన్ వాల్యూస్ తో వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. ఇక త్వరలో థియేట్రికల్ ట్రైలర్ ను విడుదల చేసే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే గ్లింప్స్ తో భారీ హైప్ తెచ్చుకున్న చిత్రానికి సంబంధించిన ట్రైలర్ కూడా అంచనాలకు మించి ఉంటే, విడుదల సమయానికి ఓవర్సీస్ మార్కెట్ లో అడ్వాన్స్ బుకింగ్ లో భారీ వసూళ్లు నమోదయ్యే అవకాశం ఉందని అంతా అభిప్రాయపడుతున్నారు. మరేం జరుగుతుందో అంతా వేచి చూడాలి.

PRINTER,PUBLISHER AND OWNED BY M. A. NAVEEN KUMAR AND PRINTED AT M /S VANAMALI PUBLICATIONS , # 2-5-B , Revenue Ward No :2, Rudrampeta, Anantapur Rural & Mandal, Anantapur -515004, Ananthapuramu District, Andhra Pradesh PUBLISHED AT D. No 1-493 B, INDIRA GANDHI NAGAR , Anantapur -515001, Ananthapuramu District, Andhra Pradesh Editor : M. A .NAVEEN KUMAR Email : kumarmanaveen @gmail.com cell: 8919517176